# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 21-5-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:224 పేజీలు:6 వెల: రూ.1/-


## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..
## వ్యాన్ బోల్తా పడి 17 మంది దుర్మరణం

రాయ్ పూర్ మే 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఛత్తీస్ గఢ్ రాష్ట్రం కవార్ధా ప్రాంతంలో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బహపనీ ప్రాంతంలో ప్రయాణీకులతో వెళుతున్న వ్యాన్ బోల్తా పడడంతో 17 మంది దుర్మరణం చెందగా ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. వాహనదారుల సమాచారం మేరకు పోలీసులు, ఆరోగ్య సిబ్బంది అక్కడికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బైగా తెగకు చెందిన వ్యక్తులు బీడీ ఆకుల సేకరించడానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వ్యాన్ 20 అడుగుల లోతులో పడిపోవడంతోనే మృతుల సంఖ్య పెరిగిందని సమాచారం.

### చురక

చెయ్యనివి చేసినట్లు
చెప్పడమే వారి విద్య
కళ్లముందు ప్రదర్శించే
గారడి కనికట్టు మిథ్య.

ఎదుటి పార్టీ పైన వాళ్లు
ఎగజిమ్మే విషభాండాలు
గెలుపును హైజాక్ చేయ
గోబెల్సులా అభాండాలు



-వేల్పుల నారాయణ

## ఛత్తీస్‌గడ్‌లోని బీజపూర్ జిల్లాలో14మంది నక్సల్స్ అరెస్ట్

### -వీరిపై మొత్తం 41 లక్షల రివార్డు :పోలిసుల వెల్లడి

బీజపూర్ మే 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);మొత్తం 41 లక్షల రివార్డు కలిగి ఉన్న14మంది నక్సల్స్ ఛత్తీస్‌గడ్ లోని బీజపూర్ జిల్లాలో అరెస్ట్ అయ్యారని బీజపూర్ పోలీస్ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వీరిలో ఆరుగురు మహిళలు, ఎనిమిది మంది పురుషులు ఉన్నారని తెలిపారు. గంగలూరు పోలీస్ స్టేషన్ పరిధి లోని ముట్వేండి అటవీ ప్రాంతం, పిడియా గ్రామాల్లో ఆదివారం డిఆర్‌జి, జిల్లా పోలీస్‌ల సంయుక్త బృందం వీరిని పట్టుకోగలిగిందని చెప్పారు. 14 మంది నక్సల్స్‌లో రేణు కొసవి , మంగ్లీ అవ్లంలకు ఒక్కొక్కరికి రూ. 8 లక్షల రివార్డు ఉంది. వీరిద్దరూ మిలిటరీ కంపెనీ నెంబరు 2 కు చెందిన వారు. గంగలూరు ఏరియా కమిటీ సభ్యులు బిచ్చెం యుయికా, షర్మిలా కుర్సం, లక్ష్మీతాటి ఒక్కొక్కరిపై రూ. 5 లక్షల రివార్డు ఉంది.మరో నలుగురు క్యాడర్లకు రూ. 2లక్షల వంతున, మిగతా ఇద్దరికి లక్ష వంతున రివార్డులు ఉన్నాయని పోలీస్‌లు ప్రకటనలో వివరించారు. వారి దాచి ఉంచిన నాలుగు టిఫిన్ బాంబులు, రెండు కుకర్ బాంబులు, డిటొనేటర్లు, కార్డెక్సు వైర్, జిలటిన్ స్టిక్స్, ఫైర్‌క్రాకర్లు, మావోయిస్టుల సంబంధిత మెటీరియల్ వారి నుంచి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈనెల 10న ఎన్‌కౌంటర్‌లో 12 మంది నక్సల్స్‌ను హతమార్చడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారి వివరాలు పోలీస్‌లు ఇంకా తెలియజేయలేదు. అయితే ఈ ఎన్‌కౌంటర్ బూటకమని గ్రామస్థులు, ఉద్యమకారులు విమర్శిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలను పోలీస్‌లు కొట్టి పారేశారు. వీరందరి తలపై నగదు బహుమతులున్నాయని వివరించారు.

## ఐదో దశలో సాయంత్రం 5 గంటల వరకు 56.68 శాతం పోలింగ్.. పశ్చిమబెంగాల్‌లో అత్యధికం..!

న్యూఢిల్లీ, 20 :దేశవ్యాప్తంగా ఐదో దశ ఎన్నికల్లో భాగంగా 8 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోని 49 లోక్‌సభ స్థానాలకు ఇవాళ పోలింగ్ జరుగుతోంది.

ఉదయం నుంచి ఓటర్లు బారులుతీరి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు.

దాంతో సాయంత్రం 5 గంటల వరకు సగటున 56.68 శాతం పోలింగ్ నమోదైంది. పశ్చిమబెంగాల్‌లో రికార్డు స్థాయిలో 73 శాతం పోలింగ్ జరిగింది.

ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం డాటాను షేర్ చేసింది.

ఎన్నికల సంఘం డాటా ప్రకారం.. పశ్చిమబెంగాల్‌లో 73 శాతం, లధక్‌లో 67.15 శాతం, జార్ఖండ్‌లో 61.90 శాతం, ఒడిశాలో 60.55 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 55.80 శాతం, జమ్ముకశ్మీర్‌లో 54.21 శాతం, బీహార్‌లో 52.35 శాతం, మహారాష్ట్రలో అత్యల్పంగా 48.66 శాతం పోలింగ్ నమోదైంది. ముంబైలో ఉదయం నుంచి కూడా పోలింగ్ నిరాశాజనకంగానే సాగుతున్నది.

అక్కడ సాయంత్రం 5 గంటల వరకు కూడా పోలింగ్ 50 శాతానికి మించలేదు.

ముంబై నార్త్‌లో 46.91 శాతం, ముంబై నార్త్ సెంట్రల్‌లో 47.32 శాతం, ముంబై నార్త్ ఈస్ట్ 48.67 శాతం, ముంబై నార్త్ వెస్ట్ 49.79 శాతం, ముంబై సౌత్‌లో అత్యల్పంగా 44.22 శాతం, ముంబై సౌత్ సెంట్రల్‌లో 48.26 శాతం పోలింగ్ నమోదైంది.

## బీజేడీ పాలనలో పూరీ జగన్నాథుడి ఆలయం సురక్షితంకాదు : ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, 20 : ఒడిశాలోని పూరీలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం జగన్నాథ ఆలయాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోను మోదీ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. 'పూరీలో మహాప్రభు జగన్నాథ్‌ను దర్శించుకున్నాను. ఆయన ఆశీస్సులు ఎల్లప్పుడూ మాపై ఉంటాయి. ప్రగతి పథంలో కొత్త శిఖరాలను మార్గనిర్దేశం చేస్తాయి' అంటూ ఫొటోకు క్యాప్షన్ ఇచ్చారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో ఒడిశాలోని అధికార బీజేడీ ప్రభుత్వంపై ప్రధాని విమర్శలు చేశారు. బీజేడీ పాలనలో పూరీలోని 12వ శతాబ్దపు జగన్నాథ్ ఆలయం సురక్షితం కాదన్నారు. గత ఆరేళ్లుగా రత్న భండార్ తాళాలు కనిపించడం లేదన్నారు.

ఏమిటీ రత్న భండార్..

ఒడిశాలోని పూరీ జగన్నాథ క్షేత్రం కిందిభాగంలో ఈ రత్న భండాగారం ఉంటుంది. గతంలో రాజులు, భక్తులు సమర్పించిన అనేక బంగారు, వజ్ర, రత్నాభరణాలు ఈ గదిలోనే భద్రపరిచారు. వీటి విలువ వెలకట్టలేనిదని అంచనా. ఆ భండార్ తెరిచేందుకు కొన్నేళ్ల క్రితం ప్రయత్నాలు జరిగాయి. ఈ క్రమంలోనే భండాగారంలోని కీలక విభాగ తాళాలు మాయం కావడం తీవ్ర చర్చకు దారితీసింది. దీంతో ఆభరణాల భద్రతపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## రాయ్‌బరేలిలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ, 20 : కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్ (కేరళ), రాయ్‌బరేలి (యూపీ) నుంచి పోటీ చేస్తున్న రాహుల్ గాంధీ సోమవారం రాయ్‌బరేలిలో పర్యటించారు. రాయ్‌బరేలిలోని ఓ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు.

రాహుల్ రాకతో పోలింగ్ కేంద్రం వద్ద కోలాహలం నెలకొంది. ప్రజలు పెద్దసంఖ్యలో గుమికూడి రాహుల్‌తో సెల్ఫీలు తీసుకునేందుకు ప్రయత్నించారు. కాంగ్రెస్ కంచుకోటగా పేరొందిన రాయ్‌బరేలిలో రాహుల్ గాంధీ విజయం కోసం ఆ పార్టీ శ్రేణులు చెమటోడ్చారు.

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ సైతం ప్రచారానికి వచ్చి తన కొడుకును రాయ్‌బరేలి ప్రజలకు అప్పగిస్తున్నానని, మీకోసం ఇక రాహుల్ పనిచేస్తారని పేర్కొన్నారు.

## కవితకు బిగ్ షాక్..మరో 14 రోజులు రిమాండ్ పొడిగింపు

న్యూ ఢిల్లీ మే 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీ ఈరోజు(సోమవారం)తో ముగిసింది. దీంతో ఈడీ, సీబీఐ రెండు కేసుల్లోనూ రౌస్ అవెన్యూ కోర్టులో విచారణ జరిగింది. ఈ మేరకు ఈ రోజు మధ్యాహ్నం 2 గంటలకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగించే విషయంపై రౌస్ అవెన్యూ కోర్టు విచారించింది. అయితే కవితను కోర్టులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈడీ, సీబీఐ అధికారులు హాజరుపరి చారు.సీబీఐ కేసులో కవిత కు జ్యుడీషియల్ రిమాండ్ జూన్3 వరకు కోర్టు పొడిగించింది. లిక్కర్ కేసులో కవితపై ఈడీ దాఖలు చేసిన తాజా ఛార్జ్ షీట్‌పై విచారణ కొనసాగు తోంది. తాజా ఛార్జ్ షీట్‌ను పరిగణ నలోకి తీసుకునే అంశంపై కోర్టు విచారణ జరుపుతుంది. తాజా ఛార్జ్ షీట్‌లో కొన్ని అంశాలపై సీబీఐ అధికారులను జడ్జి కావేరి బవేజా వివరణ అడిగారు. 15 నిమిషాలు కేసు విచారణను కోర్టు వాయిదా వేసింది.కాగా.. మార్చి 26 నుంచి జ్యుడీషియల్ కస్టడీలో కవిత ఉన్న విషయం తెలిసిందే. ఢిల్లీ మద్యం పాలసీ అక్రమాలపై సీబీఐ, ఈడీ నమోదు చేసిన రెండు కేసుల్లోనూ నేటితో రిమాండ్ ముగుస్తోండటంతో కవితను ఈరోజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరు పరిచారు. కవిత బెయిల్ కోసం ఆమె తరుపు న్యాయవాదులు చాలా ప్రయత్నించారు. ఇప్పటికే కోర్టు పలుమార్లు ఆమెకు బెయిల్ రిజెక్ట్ చేసిన విషయం తెలిసిందే.

## విద్యావంతులు మేల్కొనండి- కేటీఆర్



ఇల్లందు, మే 20 :. పచ్చి అబద్దాలు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యావంతులు కర్రుకాల్చి వాత పెట్టాలని పిలుపు ఇచ్చారు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. విద్యావంతులు ఉదాసీనంగా ఉంటే మరిన్ని అబద్ధాలాడుతూ, అసలు హామీలే ఇవ్వలేదని అంటారని హెచ్చరించారు.

ఇల్లందు నియోజకవర్గ కేంద్రంలో నేడు ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డికి మద్దతుగా కెటిఆర్ ప్రసంగిస్తూ, ప్రభుత్వ ఉద్యోగ నియామకాలపై రేవంత్ సర్కార్ పచ్చి అబద్దాలాడుతున్నారని మండిపడ్డారు. పెళ్లి కాలేదంట.. సంసారం అయిపోయి పిల్లలు పుట్టిండ్రంటా అని విమర్శించారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలను తాను ఇచ్చానని రేవంత్ అబద్ధపు ప్రచారం చేసుకుంటున్నారని కేటీఆర్ మండిపడ్డారు.

మొదటి ఏడాదిలోపే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని రేవంత్ హామీ ఇచ్చిండు. ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ కూడా కొత్తగా ఇవ్వలేదు. కానీ 30 వేల ఉద్యోగాలు ఇచ్చాను అంటున్నాడు. ఒక ఉద్యోగం ఇవ్వాలంటే నోటిఫికేషన్, పరీక్ష, ఇంటర్వ్యూ జరిగిన తర్వాత నియామకం పత్రం ఇవ్వాలి. మరి రేవంత్ వచ్చిన తర్వాత ఎన్ని నోటిఫికేషన్లు ఇచ్చారు.. ఒక్కంటే ఒక్కటి కూడా ఇవ్వలేదు. 30 వేల ఉద్యోగాలు ఎక్కడి నుంచి వచ్చాయంటే బుకాయిస్తున్నాడు దబాయిస్తున్నాడు. 30 వేల ఉద్యోగాలు ఇచ్చేశాను అంటు న్నాడు. మరోసారి నిరుద్యోగులను పిచ్చోళ్లను చేయడానికి నోటికొచ్చినట్టు వాగుతున్నాడు. 30 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వం.. నియామక పత్రాలు ఇచ్చింది మాత్రమే రేవంత్ రెడ్డి. ఈ సీఎంకు బుద్ది చెప్పాలంటే, 2 లక్షల ఉద్యోగాల హామీ నెరవేరాలంటే, ఆ ఒత్తిడి ఉండాలంటే దమ్మున్న రాకేశ్ రెడ్డిని గెలిపిస్తే శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తాడని కేటీఆర్ తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫీజుల్లేకుండా ప్రభుత్వ ఉద్యోగాల దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు. కేసీఆర్ హయాంలో టెట్‌కు దరఖాస్తు ఫీజు రూ. 400 పెడితే.. ఇదే రేవంత్ నానా యాగీ చేసిండు. ఇవాళ టెట్ పరీక్షకు వెయ్యి పెట్టిండు. ఇలాంటి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి. మొదటి కేబినెట్ సమావేశంలో మెగా డీఎస్సీ వేస్తామన్నారు. ఆ హామీ కూడా నెరవేరలేదు. సింగరేణిలో 24 వేల వారసత్వ ఉద్యోగాలు ఇచ్చాం. సింగరేణిని అదానీకి అమ్మేందుకు రేవంత్ సిద్ధంగా ఉన్నాడు. ఇదే విషయంపై మోదీతో రేవంత్ కూడబలుక్కున్నాడు. చివరకు సింగరేణిని కూడా ప్రయివేటు పరం చేస్తారు అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ సభ లో రాజ్య సభ సభ్యులు రవిచంద్ర,అభ్యర్థి రాకేష్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, డి.రాజేందర్, ఎం ఎల్ సి సత్యవతి రాథోడ్, జిల్లా పరిషత్ చైర్మన్ బిందు,లక్కినేని సురేందర్,రంగనాథ్, సిలివేరు సత్యనారాయణ వార్డు సభ్యులు వివిధ మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫెడెక్స్ పేరుతో వచ్చే కాల్స్‌ను నమ్మొద్దు..

### - ప్రజలకు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సూచన



హైదరాబాద్, 20 :ఇటీవల ఫెడెక్స్ కొరియర్ పేరుతో చాలా మందికి కాల్స్ వస్తున్నాయి. ఆధార్ నెంబర్‌తో పార్సిల్ వచ్చిందని.. అందులో అక్రమంగా రవాణా చేస్తున్న మాదక ద్రవ్యాలు పట్టుబడ్డాయని భయాందోళనకు గురి చేస్తున్నారు. డ్రగ్స్ రవాణా కేసులో శిక్షలు కఠినంగా ఉంటాయని.. కేసుల నుంచి తప్పించుకునేందుకు రూ.లక్షల్లో డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇలా ఎందరో సైబర్ నేరగాళ్ల బారినపడి లక్షల్లో సొత్తును నష్టపోయారు.

ఈ క్రమంలో తెలంగాణ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ప్రజలకు కీలక సూచనలు చేశారు. ఫెడెక్స్ పార్సిల్స్ పేరుతో వచ్చే మోసపూరిత కాల్స్‌ని నమ్మొద్దని.. పోలీసులమని చెప్పగానే భయపడి డబ్బులు ఇవ్వొద్దని చెప్పారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా అనుమానం వచ్చినా.. మోసపోయినా వెంటనే 1930 నంబర్‌కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

అయితే, సైబర్ నేరగాళ్ల బారినపడ్డ వారిలో ఎక్కువ మంది విద్యావంతులే ఉండడం ఆందోళనకం మన్నారు. సైబర్ నేరగాళ్లు మోసాలకు కొత్త కొత్త వాటిని ఎంచుకుంటున్నారన్నారు. ఇంతకు ముందు ఓటీపీ, ఓఎల్ఎక్స్, రెంట్ పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడ్డారన్న ఆయన.. తాజాగా ఫెడెక్స్ పేరుతో మోసాలకు తెరలేపారని చెప్పారు. తాము పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామని.. మీరు పంపిన పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయంటూ బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు గుంజుతున్నారన్నారు.ఎవరూ పార్సిల్స్ పంపనప్పుడు ఎందుకు భయందేనికని ప్రశ్నించారు. మోసాల బారినపడుతున్న వారిలో విద్యావంతులే ఎక్కువ ఉన్నారన్నారు. అవతలి వ్యక్తులు బయపడితే భయపెడతారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. అలాగే, పెట్టుబడులు పెడితే లక్షల్లో ఆదాయం వస్తుందని ఆశపడొద్దని సూచించారు. అన్ని వివరాలు తెలుసుకున్న తర్వాతే పెట్టుబడులు పెట్టడం మంచిదని చెప్పారు.

## తెలుగు రాష్ట్రాల్లో 3 రోజులు భారీ వర్షాలు: వాతావరణ శాఖ

హైదరాబాద్ మే 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలుగు రాష్ట్రాల్లో 3 రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. మే 23 వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. మే 22 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు అంచనా వేసింది. ఇది మే 24 నాటికి బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని పేర్కొంది. వాయిగుండంగా మారితే భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు అంచనా వేసింది.తెలంగాణలో సోమవారం భద్రాద్రి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, సిద్దిపేట, యాదాద్రి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, మెదక్, వనపర్తి జిల్లాల్లో వర్షాలు కురుస్తాయంది. అలాగే ఏపీలో ఉమ్మడి చిత్తూరు, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాలు, అనంతపురం జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

### నేటి కందం- నేటికీ అందం

అనయము శాంతిని గోరుచు
పనిమంతులు ఉగ్రవాద వ్యతిరేక దినం
బును జరిపెద రీదినమున
ప్రణతుల నందించి మిగుల రసరమ్యముగన్

(మే 21 ఉగ్రవాద వ్యతిరేక దినం)



-రాధశ్రీ
సెల్:9494481210




# విశ్వ శ్రేయస్సుకు విఘాతం ఉగ్రవాదం..!

## (21 మే 'జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినం' సందర్భంగా)

ప్రపంచ దేశాలన్నీ ఉగ్రవాద ఉచ్చులో అతలాకుతలం అవుతున్నాయి. మానవ వినాశనం, ఆస్తి నష్టం, సమాజ విచ్ఛిన్నం, దేశాభివృద్ధికి విఘాతం, అశాంతి పేట్రేగిపోవడం లాంటి దుష్ప్రభావాలతో ఉగ్రవాదం భూతం విశ్వ మానవాళిని పట్టి పీడిస్తున్నది. ఉగ్రవాదానికి పర్యాయపదంగా హింసాత్మక ఘటనలు నిలుస్తున్నాయి. ఏ పేపరు చదివినా, ఏ టీవీ చానెల్ చూసినా ప్రపంచంలో ఏదో ఒక మూలన భయానక ఉగ్రవాద హింసాత్మక ఘటనలు కనిపిస్తున్నాయి.

మానవాళిని భయకంపితులను చేయడం, సమాజంలో హింసకు ఊతం ఇవ్వడం, రక్షక బలగాలతో నేరుగా సాయుధ పోరుకు సిద్ధం కావడం, అమాయకుల మరణాలు, క్షతగాత్రుల హాహాకారాలు, దేశాల విచ్ఛిన్నాన్ని చవిచూడడమే ఉగ్రవాదుల దుశ్చర్యగా తోస్తున్నది. దీనికి తోడుగా దేశ సరిహద్దులను దాటుతూ అక్రమంగా చోరబడడం, ఆయుధాల అక్రమ రవాణ, అమాయక ప్రజలను కాల్చి వేయడం, దేశాన్ని అస్థిర పరిచే ఆకృత్యాలకు పాల్పడడం, ప్రపంచ శాంతికి విఘాతం కలిగించడం, జాతి ఏకత - మత సామరస్యం - మానవీయతను వ్యతిరేకించడం, అంతర్గత కలహాలు సృష్టించడం లాంటి దేశ వ్యతిరేక లక్ష్యాలతో ఉగ్రవాదులు పని చేస్తున్నారు. ఉగ్రవాద వ్యతిరేక అంశాల పట్ల ప్రజల్లో, ముఖ్యంగా యువతలో చైతన్యంతో కూడిన అవగాహన కల్పించడం, సంఘవ్యతిరేక శక్తుల కట్టడి, ఉగ్రవాదం మిగిల్చే నష్టాలను, దేశద్రోహ చర్యలను తెలియజేయడం లాంటి అంశాలను దేశ ప్రజలకు వివరించడానికి ప్రతి ఏటా 21 మే రోజున 'జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినం' పాటించుట జరుగుతున్నది.

**దేశ ప్రధానమంత్రినే పొట్టన పెట్టుకున్న తీవ్రవాదం:**

తమిళనాడు, శ్రీ పెరంబుదూరులో 21 మే 1991న దేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని యల్‌టిటిఈ ఉగ్రవాదులు ధాను అనే మహిళ మానవ బాంబుగా మారి హత్య చేయడం జరిగింది. ధానుతో పాటు 14 మంది మరణించిన ఈ ఉగ్రదాడిలో పాల్గొన్న పేరరివాళన్, శాంతన్, నళిని, మురుగన్‌లను దోషులుగా నిర్ణయించి సుప్రీంకోర్టు మరణశిక్ష ఖరారు చేసిన తరువాత వీరిలో ముగ్గురి శిక్షను జీవితఖైదుగా మార్చింది. రాజీవ్‌గాంధీ హత్యకేసులో 30 ఏళ్లు జైలుశిక్ష అనుభవిస్తున్న పేరరివాళన్‌ను విడుదల చేయాలని తాజాగా సుప్రీమ్ కోర్టు ఆదేశించిన విషయం మనకు తెలుసు. ఈ దుశ్చర్యకు వ్యతిరేకంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా 21 మే రోజున "జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినం" నిర్వహించుట జరుగుతున్నది.

ఉగ్రవాదం మానవజాతికి మాత్రమే కాదు ప్రపంచ మానవీయతకే సవాలుగా నిలుస్తున్నది. జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినం వేదికగా యువత సమక్షంలో 'ఆంటీ-టెర్రరిజమ్ ప్రతిజ్ఞ'ను కూడా చేయించడం జరుగుతుంది.

భారతదేశంలో పాకిస్థాన్ ఉగ్రవాదులు అనునిత్యం సరిహద్దుల్లో చోరబడడం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నకిలీ కరెన్సీ పంపిణి, ఆయుధాల అక్రమ రవాణా లాంటి పలు దేశ వ్యతిరేక చేష్టలు చేస్తూనేన్నారు.

**ప్రపంచానికే పెను సవాలుగా ఉగ్రవాదం:**

ఉగ్రవాదం అధికంగా ఉన్న దేశాల్లో అఫ్ఘానిస్థాన్, ఇరాక్, పాకిస్థాన్, నైజీరియా, సిరియా, యెమన్, సొమాలియా తరువాత ఇండియా ఉందని గమనించాలి. 1993లో బాంబే అల్లర్లలో 260 మంది అమాయ ప్రజల మరణించడంతో పాటుగా 700 మంది గాయపడడం అత్యంత హేయమైన ఉగ్రవాద చర్యగా చరిత్రలో నిలుస్తున్నది. 2001 డిసెంబర్ 13న ఐదుగురు లష్కరే-తోయిబా ఉగ్రవాదులు పార్లమెంట్‌లోకి చొరబడి జరిపిన కాల్పుల్లో 9 మంది పోలీసులు/సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. 11 జూలై 2006న ముంబాయ్ రైళ్లలో 11 నిమిషాల్లోనే ఏడు బాంబులు పేల్చగా, 209 మంది ప్రాణాలర్పించడం, 700 మందికి పైగా గాయపడడం జరిగింది. 26 నవంబర్ 2008న ముంబాయ్‌లో పాకిస్థానీ లష్కరే తోయిబా ఉగ్రవాదులు జరిపిన కాల్పులు, బాంబు విస్ఫోటనాలలో 174 మంది మరణించగా 300లకు పైగా క్షతగాత్రులు గాయపడ్డారు.

14 ఫిబ్రవరి 2019న పుల్వామా దుర్ఘటనలో 40 మంది సిఆర్‌పియఫ్ బలగాలు తుది శ్వాస విడిచాయి. ఈ దుర్ఘటనకు ప్రతిచర్యగా భారతీయ వాయు సేన పాకిస్థాన్‌లోకి చొరబడి ఉగ్రవాద స్థావరాలను నేల మట్టం చేసి, ధీటైన సమాధానం అవ్వడం కూడా జరిగింది. ఇండియాలో ఇస్లామిక్ టెర్రరిజమ్, సెపరేటిస్ట్ టెర్రరిజమ్, లెఫ్ట్ వింగ్ టెర్రరిజమ్ అనే 3 వర్గాలు ఉన్నాయి. భారత దేశంలో 1970 - 2017 మధ్య కాలంలో పలు ఘటనల్లో జరిగిన 12,002 ఉగ్రవాదుల దాడులలో, 19,866 మంది మరణించగా, 30,544 మంది గాయపడడం జరిగిందనే వాస్తవాన్ని భారతీయులు తెలుసుకోవాలి.

**ఉగ్రవాదానికి పలు కారణాలు:**

ఉగ్రవాద వ్యతిరేక దినం సందర్భంగా శాంతి, మానవీయతల పట్ల అవగాహనా సందేశం ఇవ్వడంతో పాటు ప్రజల్లో దేశభక్తి పెంపొందించడం, జాతీయ ఐక్యత, యువతలో ఉగ్రవాద వ్యతిరేక శిక్షణలు ఇవ్వడం, ఉగ్రవాద దుష్పరిణామాల వివరణ లాంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది. ఉగ్రవాదానికి కులమతాలు లేవు. అవి రక్తపాతానికి మాత్రమే దారి తీస్తాయి. ఒకరు కాని సమూహం కాని పరాయి దేశం లేదా ప్రభుత్వానికి/దేశానికి వ్యతిరేకంగా జరిపే దాడిలో హత్యలు, హింస, దాడులు, దొంగతనాలు, రేపులు, కిడ్నాపులు, భీకర పోరాటాలు, బాంబులు వేయడం లాంటి పలు దేశద్రోహ చర్యలకు పాల్పడతారు. శిక్షితులైన ఉగ్రవాదులను గుర్తించి పట్టుకోవడం చాలా కష్టంతో కూడుకొని ఉంటుంది.

ఉగ్రవాదం ఓ మహత్తర దైవ కార్యమనే భావనలో ఉగ్రవాదులు ఆత్మ బలిదానానికి కూడా వెనుకాడరు. ఉగ్రవాదులు సాధారణ జనంలో కలిసిపోయి, సరైన సమయంలో దాడి చేయడం జరుగుతుంది. అత్యాధునిక ఆయుధాల సులభ లభ్యత, జనాభా పెరుగుదల, రాజకీయ-సాంఘీక-సాంస్కృతిక- ఆర్థిక సమస్యలు, ప్రజల్లో పేరుకుపోయిన అసంతృప్తులు, అవిద్య, అక్రమార్జన, పేదరికం, లంచగొండితనం, జాతిమత విభేధాలు, ఆర్థిక అసమానతలు, భాషాభేదాలు, మతం పేరున అంధ విశ్వాసాలు లాంటివి ఉగ్రవాదానికి కారణాలు అవుతున్నాయి. ఉగ్రవాదంతో ప్రజల్లో అభద్రతాభావం, భయం, ప్రాణాలు కోల్పోవడం, ఆస్తి నష్టం, దేశం అస్థిరం కావడం లాంటి దుష్ప్రభావాలు కలుగుతాయి.

భారతదేశంలో ఉగ్రవాదాన్ని మట్టుబెట్టుటకు పోలీసులు, ఇంటలిజెన్స్, మిలిటరీలతో పాటు ఉగ్రవాద వ్యతిరేక ప్రత్యేక శిక్షణలు పొందిన ఆంటీ-టెర్రరిజమ్ స్క్వాడ్, రీసెర్చ్ అనాలిసిస్ వింగ్ (ఆర్ఏడబ్ల్యూ), నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (యన్ఐఏ), విఐపి భద్రతలను కాపాడే కమెండో దళాలు లాంటివి నిరంతరం పని చేస్తున్నాయి. ప్రపంచానికి పెను సవాలుగా నిలిచిన ఉగ్రవాద ఊడలను పెకిలించడానికి రక్షక బలగాలతో పాటు ప్రజా సహాయం, చట్టాల కఠిన అమలు జరుగుతూ ఉండాలి.

ఉగ్రవాదాన్ని కూకటి వేళ్ళతో తొలగించడానికి ప్రపంచ మానవాళి సత్వరమే ఏక తాటిపైకి రావలసిన అత్యవసర పరిస్థితులు వచ్చాయి.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# ఎంపీ వద్దిరాజు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కి సత్కారం




భద్రాద్రికొత్తగూడెం, మే 20 (నేటి నిజం ప్రతినిధి): రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కే.టీ.రామా రావును శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు విచ్చేసిన కేటీఆర్ కి ఎంపీ రవిచంద్ర పట్టణ శివార్లలో ఆత్మీయ స్వాగతం పలికా రు. ఆ తర్వాత జేకే మైదానంలో జరిగిన పట్టభద్రుల సమావేశంలో ఎంపీ వదిరాజు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ ఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఐపీఎస్ మాజీ అధికారి, పార్టీ నాగర్ కర్నూల్ లోకసభ నియోజకవర్గ అభ్యర్థి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, హరిప్రియ, ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ దిండిగల రాజేందర్ తదితర ప్రముఖులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

# విదేశాలకు ఏపి కీలక నేతలు..సర్వత్రా చర్చ

అమరావతి మే 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి తన భార్య భారతితో కలిసి లండన్ వెళ్లాక టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు కూడా తన సతీమణి భువనేశ్వరితో పాటు శనివారం రాత్రి అమెరికాకు వెళ్లారు. అక్కడ ఆయన చికిత్స చేయించుకోనున్నారు. చంద్రబాబు కుమారుడు లోకేశ్ మే 16ననే అమెరికా వెళ్లారు. కాగా చంద్రబాబు నాయుడు మే 25 లేక 26న తిరిగి రానున్నారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు జూన్ 4 ఉన్నందున ఎలాంటి చర్యలు చేపట్టాలన్న విషయంపై ఆయన పార్టీ నాయకులతో చర్చించనున్నారు. ఏపిసిసి చీఫ్ వైఎస్.షర్మిలా కూడా అమెరికాలో ఉన్న తన కుమారుడు రాజా రెడ్డి వద్దకు వెళ్లారు. ఆమె తల్లి వై.ఎస్.విజయమ్మ ఇప్పటికే అమెరికాలో ఉన్నారు.

# రోజు రోజుకు మల్లి పెరుగుతున్న కరోనా కేసులు

**-ఇటీవల వ్యర్థ నీటిలో కొవిడ్ ఆనవాళ్లను గుర్తింపు**
**-సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ నివేదిక వెల్లడి**
**-మళ్లీ మాస్క్ ధరించాలని సూచించిన ఆరోగ్య మంత్రిత్వ శాఖ**

న్యూ ఢిల్లీ మే 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);గత కొన్ని నెలలుగా కొవిడ్ శాంతించింది. తాజాగా మరోసారి విజృంభిస్తున్నది. రోజు రోజుకు కేసులు పెరుగుతున్నాయి. ఇటీవల వ్యర్థ నీటిలో కొవిడ్ ఆనవాళ్లను గుర్తించారు. ఈ విషయాన్ని సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ నివేదిక వెల్లడించింది. దీనికి 'ఫ్లర్ట్' నామకరణం చేశారు. అమెరికా, సింగపూర్ సహా అనేక దేశాల్లో ఈ కొత్త వేరియంట్ కేసులు వేగంగా పెరుగుతున్నాయి. అయితే, వేగంగా పెరుగుతున్న ఇన్ఫెక్షన్ కారనంగా సింగపూర్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రజలందరూ తప్పనిసరిగా మాస్కులు ధరించాలని మరోసారి విజ్ఞప్తి చేసింది. సీడీసీ నివేదిక ప్రకారం.. ఏప్రిల్ 14 నుంచి 27 వరకు అమెరికాలో దాదాపు 25శాతం కేసులకు కేపీ.2 సబ్ వేరియంట్ కారణంగా పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా కరోనా జేఎన్.1, కేపీ.1, కేపీ.2 ఉప వేరియంట్లు విస్తరిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. ప్రస్తుతం సింగపూర్‌లో మూడింట రెండువంతుల కంటే ఎక్కువ కేసులు కేపీ.1, కేపీ.2 వేరియంట్ కేసులున్నాయి. ఈ వేరియంట్ ఒమిక్రాన్‌ను పోలి ఉంటుంది. వేగంగా సోకుతుందని పరిశోధకులు పేర్కొన్నారు. వ్యాక్సిన్ ద్వారా శరీరంలో ఉత్పత్తయిన యాంటీబాడీలను సైతం తప్పించుకు ఒంటాయని తెలిపారు. సీడీసీ డేటా ప్రకారం ఫ్లర్ట్ వేరియంట్.. కేజీ.1.1, కేపీ.2 వేరియంట్లు ప్రస్తుతం వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. రెండు వారాల వ్యవధిలో ఈ వైవిధ్యం కారణంగా సంక్రమణ కేసులలో చాలా వేగంగా పెరుగుదల ఉందని గుర్తించారు. అమెరికాలోని యేల్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డీన్ మేగాన్ ఎల్ మాట్లాడుతూ ఫ్లర్ట్‌లో కొన్ని ఆందోళనకరమైన లక్షణాలు కనిపించా యని నివేదికలో పేర్కొన్నారు. స్పైక్ ప్రోటీన్‌లో మార్పులు ఉన్నాయని.. ఇవి సులభంగా మానవ శరీరంలోకి ప్రవేశించి ఇన్‌ఫెక్షన్‌కు కారణమవుతాయి. మీడియా నివేదికల ప్రకారం.. సింగపూర్‌లో కొవిడ్ కొత్త వేవ్ కనిపిస్తున్నది. మే 5 నుంచి 11 వరకే 25,900 కంటే ఎక్కువగానే కేసులు రికార్డయ్యాయి. ఈ క్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి ఒంగ్ యే కుంగ్ ప్రజలు మరోసారి మాస్కులు ధరించాలని విజ్ఞప్తి చేశారు. కొవిడ్ కొత్త దశ ప్రారంభంలో ఉన్నామని.. కేసులు నిరంతరం భారీగా పెరుగుతు న్నాయని.. వచ్చే రెండు, నాలుగు వారా ల్లో ఇది మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకొని మరోసారి మాస్కులు ధరించడం అలవాటు చేసుకోవాలని, తద్వారా వైరస్‌ని నియంత్రిం చవచ్చన్నారు. జూన్ నెలాఖరు వరకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం కొనసాగిం చాల్సిన ఉందన్నారు. కొత్త వేరియంట్ ఫ్లర్ట్ కేసులు భారత్‌లోనూ నమోద య్యాయి. ఇప్పటి వరకు 250 వరకు కేసులు నమోదయ్యాయని తెలుస్తున్నది. మహారాష్ట్రలోనే కేపీ.2కి చెందిన 91 కేసులను గుర్తించారు. రాష్ట్రంలోని కరోనా కేసుల పెరుగుదల నుసూచి స్తుంది. మే 15 వరకు పూణేలో అత్యధికంగా 51 మందికి ఈ కొత్త వేరియంట్ సోకింది. 20 కేసులతో థానే రెండో స్థానంలో ఉంది. అమరావతి, ఛత్రపతి సంభాజీనగర్ జిల్లాల్లో ఒక్కొక్కటి ఏడు కేసులు నమోదయ్యాయి. ఇదిలా ఉండగా.. సీడీసీ నిపుణుల లెక్కల ప్రకారం.. సెప్టెంబర్ 2023 నుంచి కేవలం 22.6శాతం వరకు మాత్రమే వయోజనులు వ్యాక్సిన్ పొందారు.

# సోనియా తీరును ఎండగట్టిన ప్రధాని మోడీ

**-రెండు లోక్‌సభ సీట్లకు రాహుల్ పోటీపై ఆక్షేపణ**
**-కుటుంబ ప్రాధాన్య' పార్టీలపై హెచ్చరిక**
**-మావోయిస్ట్ భాష మాట్లాడుతున్న రాహుల్**

జంషెడ్‌పూర్ మే 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్) : ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ తీరును ఎండగట్టారు. రాయబరేలిని 'వదలివేసిన' సోనియా గాంధీ తన కుమారుడు రాహుల్ గాంధీని ఆ లోక్‌సభ సీటుకు నామినేట్ చేయడాన్ని ప్రధాని మోడీ ఆక్షేపించారు. ఝార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో ఒక ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ, 'ప్రచారం కోసం రాయబరేలికి (సోనియా గాంధీ) వెళ్లి, తన కుమారునివారికి అప్పగిస్తున్నానని చెప్పారు.దీర్ఘ కాలం రాయబరేలిలో పని చేసిన పార్టీ కార్యకర్త ఒక్కరూ వారికి కనిపించలేదా?' అని అన్నారు. 'కొవిడ్ తరువాత ఆమె (సోనియా గాంధీ) ఒక్కసారి కూడా తన నియోజకవర్గాన్ని సందర్శించలేదు. ఇప్పుడు ఆమె తన తనయుని కోసం వోట్లు అడుగుతున్నారు. ఆ సీటును తమ కుటుంబ ఆస్తిగా వారు భావిస్తున్నారు' అని మోడీ విమర్శించారు. సోనియా గాంధీ తన పిల్లలు రాహుల్, ప్రియాంక వెంట ఉండగా తన పూర్వపు నియోజకవర్గం రాయబరేలిలో ఒక ఎన్నికల ర్యాలీలో శనివారం ప్రసంగించారు. తన కుమారుడు (రాహుల్ గాంధీ)ని రాయబరేలికి అప్పగిస్తున్నానని, 'అతను మిమ్మల్ని నిరాశ పరచడు' అని ఆమె చెప్పారు.రెండు లోక్‌సభ సీట్లకు పోటీ చేస్తున్నందుకు రాహుల్ గాంధీని ప్రధాని మోడీ విమర్శించారు. 'కాంగ్రెస్ యువరాజు ఎన్నికల్లో పోటీ చేసేందుకు వాయనాడ్ నుంచి రాయబరేలికి పారిపోయారు. అది తన తల్లి సీటు అని ప్రతి ఒక్కరికీ చెబుతూ ఆయన అంతటా తిరుగుతున్నారు' అని మోడీ పేర్కొన్నారు. 'ఎనిమిది సంవత్సరాల పిల్లవాడు చదువు కోసం పాఠశాలకు వెళితే అక్కడ తన తండ్రి చదివినప్పటికీ అది తన తండ్రి పాఠశాల అని అతను చెప్పడు. ఈ కుటుంబ ప్రాధాన్య వ్యక్తులు పార్లమెంటరీ సీట్ల విల్లు రాస్తున్నారు. అటువంటి కుటుంబ ప్రాధాన్య కుటుంబాల నుంచి ఝార్ఖండ్‌ను రక్షించవలసి ఉంటుంది' అని ప్రధాని మోడీ అన్నారు.

రాహుల్‌పై విమర్శల స్థాయి పెంచిన మోడీ

అదే సమయంలో రాహుల్‌పై ప్రధాని విమర్శల స్థాయిపెంచారు. 'యువరాజు మావోయిస్ట్ భాష వాడుతున్నందున' కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో పెట్టుబడులకు ముందు ఏ పారిశ్రామికవేత్త అయినా 50 సార్లు ఆలోచిస్తారని అన్నారు. 'కాంగ్రెస్ 'షెహజాదా' ఉపయోగిస్తున్న భాష ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో పెట్టుబడులకు ముందు 50 సార్లు ఆలోచిస్తారుడ మావోయిస్ట్‌లు మాట్లాడే భాషను 'షెహజాదా' వాడుతూ, వినూత్న పద్ధతుల ద్వారా డబ్బును లాక్కుంటున్నారు' అని రాహుల్‌ను దృష్టిలో పెట్టుకుని మోడీ ఆరోపించారు.'తమ షెహజాదా వాడుతున్న పరిశ్రమ వ్యతిరేక, పారిశ్రామికవేత్త వ్యతిరేక భాషతో ఏకీభవిస్తారా లేదా అన్నది కాంగ్రెస్, ఇండియా కూటమి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమాధానం ఇస్తారా అని సవాల్ విసురుతున్నాను' అని మోడీ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించలేదని, ఆ పార్టీ పూర్వపు ప్రభుత్వాల హయాంలో18 వేల గ్రామాల పరిస్థితి 18వ శతాబ్దంనాటిదిగా ఉందని మోడీ ఆరోపించారు.

# రైతు రుణమాఫీపై కాంగ్రెస్ పూటకో మాట

**- నిప్పులు చెరిగిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్**

యదాద్రి భువనగిరి మే 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): రైతు రుణమాఫీపై కాంగ్రెస్ పూటకో మాట మారుస్తుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చి అన్నింటినీ మరిచిపోయిందని, ఇవాళ తెలంగాణ ఆగమైందని, మనమే ప్రశ్నించాలన్నారు. వరంగల్ ? ఖమ్మం ? నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా ఈరోజు భువనగిరిలో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేట్స్ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మాట్లాడారు. బిట్స్ పిలానీలో చదివిన విద్యావంతుడు రాకేష్ రెడ్డి అని కొనియాడారు. ప్రశ్నించే గొంతుకు రాకేష్ రెడ్డిని గెలిపించాలని కోరారు. అటు వైపు ఉన్న ప్రత్యర్థి బ్లాక్‌మెయిలర్ అని, సొల్లు కబుర్లు చెప్పే మోసగాడు అని మండిపడ్డారు. 30 వేల ఉద్యోగాలను కెసిఆర్ భర్తీ చేస్తే వాటికి నియామక పత్రాలు ఇచ్చి రేవంత్ రెడ్డి సొంత డబ్బా కొట్టుకుంటున్నారని, ఇది సిగ్గుచేటు అని, రేవంత్ రెడ్డివి పచ్చి అబద్ధాలు అని ధ్వజమెత్తారు. పిఎం మోడీ అన్ని వర్గాలను మోసం చేస్తున్నారని, విభజన హామీలను తుంగలో తొక్కారని, బిజెపి వాళ్లు గుడి కట్టి ఓట్లు అడుతున్నారని కెటిఆర్ దుయ్యబట్టారు.యాదాద్రి ఆలయాన్ని బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ అద్భుతంగా నిర్మించారని, కాళేశ్వరం లాంటి ఆధునిక ఆలయాన్ని కూడా కెసిఆర్ నిర్మించారన్నారు. కెసిఆర్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో నంబర్ వన్ స్థానంలో ఉందని, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూడు మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామని, యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మించామని, బిఆర్ఎస్ పాలనలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. చేసిన పని సరిగా చెప్పుకోలేక అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి పాలయ్యామని, స్వల్ప తేడాతో ఓటమి చెందామని కెటిఆర్ వివరించారు.

# 'మహాలక్ష్మి' పథకంపై కాంగ్రెస్ దృష్టి

న్యూఢిల్లీ మే 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: లోక్‌సభ ఎన్నికల్లో ఆరవ, ఏడవ విడత పోలింగ్‌కు ముందు మహిళలను విస్తృతంగా ఆకర్షించడంపై కాంగ్రెస్ మరింతగా దృష్టి కేంద్రీకరించింది. తమ ప్రతిపాదిత 'మహాలక్ష్మి' పథకానికి విస్తృత ప్రచారం లక్ష్యంగా పార్టీ 40 లక్షల పైచిలుకు కరపత్రాలు పంపిణీ చేయాలని యోచిస్తున్నట్లు, ఆ పథకం కింద పేద కుటుంబం నుంచి ఒక మహిళకు ఏటా లక్ష రూపాయలు ఇవ్వనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. 'తీవ్ర సంక్షోభం' నేపథ్యంలో దేశంలోని మహిళలు క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్నారని, వారి కోసం పార్టీ ప్రతిపాదిత 'మహాలక్ష్మి పథకం' వారి జీవితాల మెరుగుదలకు దోహదం చేస్తుందని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ క్రితం వారం ఒక వీడియో సందేశంలో సూచించారు.'పేద కుటుంబంలో ఒక మహిళకు ప్రతి ఏడాది మేము లక్ష రూపాయలు ఇవ్వగలమని కాంగ్రెస్ 'మహాలక్ష్మి' పథకం గ్యారంటీ ఇస్తోంది' అని ఆమె తన వీడియో సందేశంలో తెలిపారు. ఆరవ, ఏడవ దశలకు ముందు దేశవ్యాప్తంగా పోలింగ్ జరగనున్న నియోజక వర్గాలలో 'మహాలక్ష్మి' పథకంపై ప్రధాన దృష్టితో కాంగ్రెస్ 40 లక్షలకు పైగా కరపత్రాలు పంపిణీ చేయనున్నదని ఆ వర్గాలు తెలియజేశాయి. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ శనివారం ఢిల్లీలో ఒక ర్యాలీలో ప్రసంగిస్తూ, ఇండియా కూటమిని అధికారంలోకి తీసుకురావడానికి పార్టీ ఉద్దేశించిన మహాలక్ష్మి పథకం గురించి ప్రస్తావించారు. జూలై 1న పేద మహిళలు తమ ఖాతాలను సరి చూసుకున్నప్పుడు 'మ్యాజిక్'గా రూ. 8500డిపాజిట్ అయినట్లు కనుగొంటారని రాహుల్ ఇంతకుముందు ఒక బహిరంగ సభలో చెప్పారు.ప్రతి నెల మొదటి తేదీన ఇది జరుగుతుందని ఆయన తెలిపారు. భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ్ యాత్ర సమయాల్లో పలువురు మహిళలు రాహుల్ గాంధీని కలుసుకుని తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తెచ్చారని, ఆ తరువాత మహాలక్ష్మి పథకాన్ని కాంగ్రెస్ ప్రతిపాదించిందని పార్టీ వర్గాలు వివరించాయి. కాంగ్రెస్ వాగ్దానం చేసిన ఐదు ప్రధాన గ్యారంటీల్లో మహాలక్ష్మి ఒకటి. 'బేషరతు నగదు బదలీగా ప్రతి పేద భారతీయ కుటుంబానికి ఏటా లక్ష రూపాయలు ఇచ్చేందుకు మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించాలని కాంగ్రెస్ తీర్మానించింది. స్వల్ప ఆదాయ కుటుంబాలలోని పేదలను గుర్తిస్తారు' అని కాంగ్రెస్ మేనిఫెస్టో తెలిపింది. లోక్‌సభ ఎన్నికల్లో ఆరవ విడత పోలింగ్ ఈ నెల 25న, ఏడవ, ఆఖరి విడత పోలింగ్ జూన్ 1న జరగనున్నాయి. వోట్ల లెక్కింపు జూన్ 4న జరుగుతుంది.

# లోక్‌సభ ఎన్నికల వేళ దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రలోభాల పర్వం

**-ఎన్నికల తనిఖీల్లో రూ.8,889 కోట్ల సొత్తు స్వాధీనం**
**- కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడి**

న్యూ డిల్లీ మే 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );లోక్‌సభ ఎన్నికల వేళ ఓటర్లను ఆకట్టుకోడానికి దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రలోభాల పర్వం సాగుతున్నట్టు తెలుస్తోంది. ఈ సందర్భంగా చేపట్టిన తనిఖీల్లో ఇప్పటివరకు రూ.8,889 కోట్ల మేర విలువైన నగదు, మాదక ద్రవ్యాలు , ఇతర తాయిలాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది.

జప్తు చేసిన సొత్తులో మాదక ద్రవ్యాలదే 45 శాతం వాటా అని, రూ. 3958 కోట్ల మేర డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించింది. స్వాధీనమైన సొత్తులో నగదు రూపేణా రూ.849.15 కోట్లు, మద్యం (రూ.814. 85 కోట్లు ), మాదక ద్రవ్యాలు (రూ.3958 కోట్లు) బంగారం, వెండి వంటి ఆభరణాలు (రూ. 1260.33 కోట్లు ), ఇతర ఉచితాలు (రూ. 2006.59 కోట్లు ) ఉన్నట్టు ఈసీ తెలియజేసింది. అత్యధికంగా గుజరాత్‌లో రూ. 1461.73 కోట్ల విలువైన ప్రలోభాలను స్వాధీనం చేసుకున్నట్టు ఈసీ తన నివేదికలో వెల్లడైంది. రాజస్థాన్ (రూ. 1133.82 కోట్లు), పంజాబ్ (రూ.734.54 కోట్లు), రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో చూసుకుంటే ఆంధ్రప్రదేశ్‌లో రూ301. 75 కోట్లు , తెలంగాణలో రూ. 333.55 కోట్లు సొత్తు జప్తు చేసింది.

# ఏపీకి కొత్త పోలీసు అధికారులు -ఈసీ సస్పెండ్ చేసిన స్థానంలో నియామకం

అమరావతి, మే 20 :ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నికల సమయంలో జరిగిన ఘర్షణలకు బాధ్యులుగా చేస్తూ ఎలక్షన్ కమిషన్ పోలీస్ అధికారులను బదిలీ చేసిన విషయం తెలిసిందే. వారి స్థానంలో కొత్త వారిని నియమించింది. ఇందులో నర్సరావుపేట డీఎస్పీగా ఎం. సుధాకర్ రావు, గురజాల డీఎస్పీగా సీహెచ్ శ్రీనివాసరావు, తిరుపతి డీఎస్పీగా రవిమనోహర చారి, తిరుపతి ఎస్బీ డీఎస్పీగా ఎం. వెంకటాద్రి, తాడిపత్రి డీఎస్పీగా జనార్ధన్ నాయుడు లను ఈసీ పోస్టింగ్ ఇచ్చింది. తిరుపతి ఈస్ట్ డీఎస్పీగా రవిమనోహరాచారి నియామకం అయ్యారు.

అల్లర్ల అట్టడి చేయడంలో విఫలం అయ్యారంటూ సురేంద్రరెడ్డిపై ఈసీ వేటు వేసింది. అలిపిరి సీఐగా రామరాం నియామకం చేయగా.. తిరుపతి ఎస్బీ డీఎస్పీ వెంకటాద్రి, సీఐగా విశ్వనాథ చౌదరిలను నియమించింది. అలాగే, తాడిపత్రిలో జరిగిన అల్లర్లను కట్టడి చేయడంలో విఫలం అయ్యారంటూ గంగయ్యపై ఈసీ వేటు వేసింది. అతడి స్థానంలో డీఎస్పీగా జనార్ధన్ నాయుడిని ఎన్నికల కమిషన్ పోస్టింగ్ ఇచ్చింది. తాడిపత్రి పట్టణ సీఐగా నాగేంద్రప్రసాద్ నియామకం అయ్యారు.



# వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలి..

## -సీఎం రేవంత్ రెడ్డి ని కలసి వినతిపత్రం ఇచ్చిన బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి..



హైదరాబాద్ మే 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పినా,ఇంప్లిమెంట్ కావడం లేదు ,తడిసిన ధాన్యం ప్రతీ గింజ ప్రభుత్వం కొనాలని సీఎం రేవంత్ రెడ్డి ని కలసి వినతిపత్రం ఇచ్చిన బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి విజ్ఞప్తి చేసారు.ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి ని బిజెపి ఎంఎల్ఏ లతో కలసి వినతిపత్రం సమర్పించారు.అనంతరం మహేశ్వర్ రెడ్డి మీడియా తో మాట్లాడుతూ రైతు బోనస్ అమలు చేయాలి..రైతు రుణమాఫీ చేసి ,రైతు లకు ఉపశమనం కల్పోంచాలి..కొనుగోలు కేంద్రాలలో రైతు లకు రసీదు లు ఇవ్వడం లేదని సీఎం కి చెప్తే..అధికారులను పిలిచి సీఎం ఆదేశాలు జారీ చేసారు.మూడు నుంచి నాలుగు కేజీ లు అదనంగా ధాన్యం తీసుకుంటున్నారు..కొనుగోలు ఆలస్యం చేయడం వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు.

మిగిలిన రైతు బంధు తో పాటు ,రైతు భరోసా నిధులు విడుదల చేయాలని కోరాం..కేవలం రైతు ల అంశాలను మాత్రమే కాకుండా ఇతర అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్ళాం..మా వినితి పై ప్రభుత్వం స్పందించకుంటె బీజేపీ ఉధ్యమ కార్యాచరణ తీసుకుంటుందని తిలిపారు.అలాగే అన్ని రకాల వడ్ల కు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేసారు.

# కౌంటింగ్ రోజున పిఠాపురం, కాకినాడలో భారీగా అల్లర్లు - ఇంటెలిజెన్స్ నివేదిక

అమరావతి, మే 18 :ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ టెన్షన్.. ఫలితాల వెల్లడి రోజు ఏం జరుగుతుందోనన్న టెన్షన్ చాలామందిని వెంటాడుతోంది. నిఘా వర్గాల సమాచారం మేరకు రెండు నియోజకవర్గాల్లో హింస జరిగే అవకాశమున్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా జనసేన అధినేత పోటీ చేస్తున్న పిఠాపురం నియోజకవర్గం ఒకటైతే, మరొకటి కాకినాడ. ఏపీలో శాసనసభతోపాటు లోక్ సభకు ఎన్నికలకు ఒకే విడత మే 13న ఎన్నికలు జరిగాయి. దాని తర్వాత సమస్యాత్మక ప్రాంతాల్లో హింస రేగింది. ఎన్నికల ముగిసిన తర్వాత కొన్ని ప్రాంతాలలో అభ్యర్థులపై దాడులు, ఆఫీసులు ధ్వంసం చేయడం జరిగింది. పరిస్థితి గమనించిన ఎన్నికల సంఘం ఆయా నియోజకవర్గాల్లో 144 సెక్షన్ విధించింది. అంతేకాదు పోలింగ్ తర్వాత బలగాలు అక్కడే ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో పరిస్థితులు శాంతించాయి.

తాజాగా నిఘా వర్గాల నుంచి ఎన్నికల సంఘానికి కీలక నివేదిక అందినట్టు వార్తలు వస్తున్నాయి. కౌంటింగ్ నేపథ్యంలో పిఠాపురం, కాకినాడ నియోజకవర్గాల్లో హింస చోటు చేసుకునే అవకాశముందన్నది దాని సారాంశం. కాకినాడ సిటీ నియోజకవర్గంలోని ఏటిమొగ, దుమ్ములపేట, రామకృష్ణారావుపేట ప్రాంతాల్లో ఘర్షణలు జరగవచ్చని తెలిపింది. దీంతో ఆయా ప్రాంతాలపై ఈసీ కన్నేసింది. అక్కడ బలగాలను మోహరించింది. 2019 ఎన్నికల సమయంలో ఆయా ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయని నిఘా వర్గాలు గుర్తుచేశాయి. అలాగే జనసేన అధినేత పవన్ కల్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురంలో ఘర్షణలు చోటు చేసుకునే అవకాశముందని తెలిపింది. దీంతో ఎన్నికల సంఘం సీఐఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, ఏపీఎస్పీ, లోకల్ పోలీసులను మొహరించింది. ఎలాంటి ఘర్షణలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టింది.

ఎన్నికల సమయంలో కాకినాడ వైసీపీ అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి- జనసేన అధినేత పవన్ కల్యాణ్ మధ్య మాటలయుద్ధం తారాస్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో ఇంటెలిజెన్స్ నివేదిక రావడంతో ఈసీ అలర్ట్ అయ్యింది.

# ఓటమి భయంతోనే టీడీపీ కుట్రపూరిత ప్రచారం : పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి



తిరుపతి, 20 : తెలుగుదేశం పార్టీ ఎన్నికల్లో ఓడిపోతుందని తెలిసిపోవడంతోనే ఆ పార్టీ నాయకులు తమపై తప్పుడు ఆరోపణలతో ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి విమర్శించారు. ఆదివారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ? లోకేశ్ ట్విట్టర్ లో మాపై తప్పుడు పోస్టులు పెడుతున్నాడన్నారు.

ఐదేళ్లు మంత్రిగా పనిచేసి టికెట్ తెచ్చుకోలేని దేవినేని ఉమా కూడా మాట్లాడుతున్నాడన్నారు. 2013 నుంచి ఆఫ్రికాలో మేము వ్యాపారం చేస్తున్నామని, ఇక్కడ నుంచి వాహనాలు, మెషినరీ అక్కడకు పంపిస్తున్నామని చెబుతూ మొదటి విడత గా 20 బండ్లు బాంబే పోర్ట్ నుంచి షిప్ లో పంపిస్తునామని చెప్పారు.

అక్కడ చేస్తున్న ఫెరో మగనీస్, సిలికాన్ మైనింగ్ ప్రాజెక్ట్ ల అవసరాలకోసం స్వర్ణ మెటల్స్ కు 100 వెహికల్స్ అవసరం ఉంది, ఇక్కడ నుంచి వాహనాలు పంపిస్తున్నామన్నారు. దీనిపై తాము విదేశాలకు పారిపోతున్నామని , వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశాలకు పారిపోతున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

దీనిపై పచ్చ పత్రికలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని అన్నారు. 4వ తేది ఎన్నికలు ఫలితాలు తర్వాత వాళ్ళు ఎక్కడ ముఖాలు పెట్టుకుంటారో చూడాలని,తాము చేసిన సంక్షేమ పథకాలు వల్లే పోలింగ్ పెరిగిందని అంటూ 4వ తేదీ రిజల్ట్ తర్వాత అన్ని మాట్లాడదామన్నారు.

పోలింగ్ శాతం పెరగటానికి మహిళలే కారణమని ఐ పాక్ టీమ్ ఇదే చెప్పిందని, తమకు అనుకూల ఓటు 7 నుంచి 8 శాతం పెరిగిందని చెప్పారు. అందరి కృషివల్లే మేము ఎక్కువ సీట్లు ఘన విజయం సాధిస్తున్నామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి ధీమా వ్యక్తం చేసారు.

# అధికారులపై రైతులు గరం..గరం..



మెదక్, 20 :రైతులు అకాల వర్షంతో వడ్లు మొలకెత్తడంతో రైతులు ఆగ్రహించారు. తాజా మాజీ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో మాసాయిపేట ఉప తాసిల్దార్ శ్రీకాంత్, ఆర్ ఐ తన్సింగ్, అధికాం లను కలిసి మొలకల వడ్లను చూపిస్తు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉప తాసిల్దార్ మాట్లాడుతూ మూడు రోజులు గడువు తీసుకొని అన్ని వడ్లను రైస్ మిల్ తరలిస్తామని హామీ ఇచ్చారు. రైస్ మిల్క్ తరలిస్తామని మొలకెత్తిన వడ్లు కూడా తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి పసుల కిష్టయ్య, మాజీ సర్పంచ్ చిటిమల నాగరాజు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రైతులు పాల్గొన్నారు.

# భారత్ తో వాణిజ్య సంబంధాలు తెంచుకున్న పాకిస్థాన్

ఇస్లామాబాద్ మే 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: పుల్వామ దాడుల తర్వాత దిగుమతులపై భారత్ అధిక పన్నులు విధించిన కారణంగా పాకిస్థాన్, భారత్ తో వాణిజ్య సంబంధాలను 2019 నుంచి సస్పెండ్ చేసుకుందని పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దర్ అన్నారు. పాకిస్థాన్ కు ఉప ప్రధాని కూడా అయిన దర్ నేషనల్ అసెంబ్లీకి సమర్పించిన రాతపూర్వక సమాధానంలో " పాకిస్థాన్ నుంచి దిగుమతి చేసుకున్న వస్తువుల పైన భారత్ 200 శాతం పన్నులు విధించాలని నిర్ణయించుకుంది. పుల్వామా దాడుల తర్వాత కశ్మీర్ బస్ సర్వీస్ ను రద్దు చేసింది. వాస్తవాధీన రేఖ వెంబడి వాణిజ్యాన్ని కూడా రద్దు చేసుకుంది" అని తెలిపారు.పాకిస్థాన్ ఎదుర్కొంటున్న వాణిజ్య సవాళ్లను..ముఖ్యంగా భారత్ తో వాణిజ్య సంబంధాల విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలపై పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ శాసనసభ్యుడు షర్మిలా ఫారూఖీ అడిగిన ప్రశ్నకు దర్ జవాబిస్తూ అలా చెప్పారని 'డాన్' దినపత్రిక పేర్కొంది.లండన్ లో మార్చిలో జరిగిన ఓ విలేకరుల సమావేశంలో దర్ మాట్లాడుతూ భారత్ తో వాణిజ్య సంబంధాలను పునరుద్ధరించుకోవాలన్న ఆత్రుతతో పాకిస్థాన్ ఉందన్నారు. అయితే ఆయన కార్యాలయం మాత్రం భారత్ తో వాణిజ్య సంబంధాలను పునరుద్ధరించుకోవాలన్న ప్లాన్ పాకిస్థాన్ కు లేదని స్పష్టం చేసింది. పాక్, భారత వాణిజ్య సంబంధాలు 2019 నుంచి లేవు.

# ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు అనుమానాస్పదంగా మృతి..

అమరావతి, మే 20 :కర్నూలు శివారులోని నగరవనం వద్ద ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. ఈ ఘటన కర్నూలు సమీపంలోని గార్గేయపురం చెరువు వద్ద చోటుచేసుకుంది. చెరువులో ఇద్దరి మృతదేహాలను గుర్తించిన స్థానికులు కర్నూలు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. చెరువు ఒడ్డున మరో మృతదేహాన్ని గుర్తించారు.మృతులు ముగ్గురు ఎవరు వారు ఏ ప్రాంతానికి చెందినవారు, వారు ఎలా మరణించారు అనేది మిస్టరీగా మారింది. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి ట్రాన్స్‌జెండర్లను తీసుకొచ్చి మృతదేహాలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

# చెరువులో ముగ్గురు మహిళల మృతదేహాలు

అమరావతి, మే 20 :కర్నూల్‌లో విషాదం చోటు చేసుకుంది. చెరువులో ముగ్గురు మహిళల మృతదేహాలు వెలుగు చూశాయి. కర్నూలు(మ) గార్గేయపురం చెరువులో గుర్తు తెలియని ముగ్గురు మహిళల మృతదేహాలు కలకలం రేపుతున్నాయి. ముందుగా ఒకే ప్రాంతంలో రెండు మృత దేహాలు గుర్తించారు పోలీసులు. వెలికి తరలిస్తుండగా చెరువుకు అవతలి ఒడ్డున మరో మహిళ గుర్తించారు. మహిళలపై ఎలాంటి గాయాలు కనిపించలేదు.ముగ్గురు మహిళలు ఆత్మహత్య చేసుకున్నారా ప్రమాదవశాత్తు పడిపోయారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రీవారి దర్శనానికి 24గంటలు వేచి ఉండాల్సిందే..

తిరుపతి, 20 :తిరుమలలో నేడు కూడా భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. ఆదివారం కావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. వరసగా నాలుగు రోజుల నుంచి తిరుమలకు భక్తుల తాకిడి ఎక్కువయింది. అన్ని కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో నిండిపోయాయి.

వసతి గృహాలు దొరకడం కూడా కష్టంగా మారింది. వసతి గృహాల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. మూడు వందల రూపాయల ప్రత్యేక దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులకు శ్రీవారి దర్శనం మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. ఈరోజు తిరుమలలోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి క్యూ లైన్ బయట వరకూ విస్తరించి ఉంది. ఉచిత దర్శనం భక్తులకు శ్రీవారి దర్శనం 24 గంటల సమయం పడుతుంది.

# డయాగ్నొస్టిక్ కేంద్రాల పైనా శీతకన్నే-హరీశ్ రావు

హైదరాబాద్, 20 :రాష్ట్ర ప్రజలకు పూర్తి ఉచితంగా వైద్య పరీక్షలు అందించేందుకు బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన తెలంగాణ డయాగ్నొస్టిక్ వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు నెలలలోనే కుప్పకూల్చడం బాధాకరం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు.

కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా 36 డయాగ్నొస్టిక్ కేంద్రాలు ఏర్పాటు చేసి, 134 రకాల వైద్య పరీక్షలను అందుబాటులోకి తీసుకువచ్చి వైద్య సేవల్లో తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలిపారు. లక్షలాది నిరుపేద, సామాన్య ప్రజలకు ఆర్థిక భారం లేకుండా చేసి, నాణ్యమైన వైద్య పరీక్షలను అందించిన డయాగ్నొస్టిక్ కేంద్రాలు ఇప్పుడు నిర్వహణ లోపంతో కొట్టుమిట్టాడుతున్నాయి. సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి. ప్రజారోగ్యం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి ఇది నిదర్శనం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి డయాగ్నొస్టిక్స్ కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యులకు, సిబ్బందికి ఆరు నెలల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి. డయాగ్నొస్టిక్ కేంద్రాల ద్వారా అన్ని రకాల పరీక్షలు, వైద్య సేవలు ప్రజలకు అందే విధంగా చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు తెలిపారు.

# బీసీ గురుకుల జూనియర్ కాలేజీల ప్రవేశ పరీక్ష ఫలితాలు వెల్లడి

**-సీట్ల భర్తీ ప్రక్రియ ఈనెల 20 నుంచి ప్రారంభం**
**-ఎంపీసీలో 8624, బైపీసీలో 6463,**
**-ఎంఇసిలో 484, సిఇసి 2676,**
**-హెచ్ ఇ సి లో 229 సీట్లు, ఒకేషనల్ కోర్సులు 273 సీట్లు**
**-ఇందులో బాలికల కోసం 9841,**
**-బాలుర కోసం 8635,**
**-ఒకేషనల్ కోర్సుల్లో 273 సీట్లు**

హైదరాబాద్ మే 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):బీసీ గురుకుల జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను ఆన్ లైన్ https://mjpabcwreis.cgg.gov.in/లో అందుబాటులో ఉంచామని తెలంగాణ మహాత్మా జ్యోతిబా ఫులే బీసీ సంక్షేమ గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు, ఐ ఎఫ్ ఎస్ గారు ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ బీసీ గురుకుల జూనియర్ కళాశాలలో అడ్మిషన్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 208 కేంద్రాల్లో ఏప్రిల్ 28న నిర్వహించిన ప్రవేశ పరీక్ష లో మెరిట్ సాధించిన విద్యార్థులు తమకు అలాట్ చేసిన కాలేజీల్లో ఈ నెల 20వ తేదీ నుంచి 30వ తేదీ లోగా రిపోర్ట్ చేయాలని సైదులు గారు పేర్కొన్నారు. బీసీ గురుకుల జూనియర్ కాలేజీల్లో ఎంపిసీలో 8624, బైపిసిలో 6463, ఎంఇసిలో 484, సిఇ సిలో 2676, హెచ్ ఇ సిలో 229 సీట్లు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. ఇందులో బాలికల కోసం 9841, బాలుర కోసం 8635 కేటాయించగా, ప్రత్యేకంగా వృత్తి విద్యా కోర్సులు - అగ్రికల్చర్ ఒ క్రాప్ ప్రొడక్షన్ లో 19 సీట్లు, కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ 11 సీట్లు, కంప్యూటర్ గ్రాఫిక్స్ ఒ యానిమేషన్‌లో 35 సీట్లు, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఓఒ) 76 సీట్లు, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ లో 92 సీట్లు, ఫిజియోథెరపీలో 12 సీట్లు, ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్ లో 9 సీట్లు, టూరిజం ఒ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో 19 సీట్లు కలిపి మొత్తం 273 సీట్లు భర్తీ చేస్తామన్నారు. బీసీ గురుకుల జూనియర్ కాలేజీ ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులందరూ వెబ్ సైట్ లో తమ ఫలితాలు సరిచూసుకోవాలని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా బీసీ విద్యార్థులకు ఉన్నత విద్య అందించే లక్ష్యంతో పనిచేస్తుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని అందుకుని ఉన్నత విద్యను అభ్యసించాలని ఆయన సూచించారు.

# ఏసీబీ వలకు చిక్కిన అవినీతి చేప

సిరిసిల్ల, మే 20: రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం కలెక్టరేట్ కార్యాలయంలోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో సోమవారం అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న జోగినపల్లి భాస్కర్ రావు రూ. 7 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.

జిల్లాలోని గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ వెంకటేష్ సుమారు నాలుగున్నర లక్షలతో నిర్మించిన స్మశాన వాటిక కాంపౌండ్ వాల్ బిల్లు కోసం నాలుగు నెలలుగా తిప్పుతూ, చీఫ్ ప్లానింగ్ అధికారికి పంపించడం కోసం ఎనిమిది వేల రూపాయల లంచం డిమాండ్ చేశారు. దీనితో వెంకటేష్ ఏసీబీని ఆశ్రయించినట్టు ఏసీబీ డీఎస్పీ వివి రమణమూర్తి తెలిపారు.

అనంతరం ఏసీబీ అధికారులు పథకం ప్రకారం వల వేయడంతో సోమవారం రూ. 7 వేలు నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా భాస్కర్ రావు ను పట్టుకున్నారు. భాస్కర్ రావును అరెస్టు చేసి కరీంనగర్ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరచనున్నట్లు డీఎస్పి తెలిపారు. అవినీతి అధికారులతో పీడించబడుతున్న బాధితులు ఏసీబీ డీఎస్పీ 91543 88954, సర్కిల్ ఇన్స్పెక్టర్లు 91543 88955, 9154388956 నెంబర్లను సంప్రదించాలని ఈ సందర్భంగా డీఎస్పీ రమణమూర్తి సూచించారు.

# మంత్రివర్గ సమావేశానికి ఎన్నికల కమిషన్ షరతులతో అనుమతి



హైదరాబాద్ మే 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: తెలంగాణ మంత్రివర్గ సమావేశానికి ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చింది. మంత్రివర్గ భేటీకి షరతులతో కూడిన అనుమతి ఇసి ఇచ్చింది. జూన్ 4 లోపు చేయాల్సిన అత్యవసర విషయాలపైనే చర్చించాలని షరతు విధించింది. రైతు రుణమాఫీ, ఉమ్మడి రాజధాని అంశాలపై కేబినెట్‌లో చర్చించవద్దని సూచించింది.

ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన అధికారులు భేటీలో పాల్గొనవద్దని ఇసి తెలిపింది. రేవంత్ ప్రభుత్వం శనివారం కేబినెట్ భేటీ నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఇసి అనుమతి రాకపోవడంతో వాయిదా వేశారు.

ఇసి నుంచి ఎప్పుడు అనుమతి లభిస్తే అప్పుడు కేబినెట్ భేటీ కావాలని నిర్ణయం తీసుకున్నారు. ఇసి అనుమతి ఇవ్వకపోతే ఢిల్లీకి వెళ్లి చీఫ్ ఎలక్షన్ కమిసనర్‌ను కలవాలని నిర్ణయం తీసుకున్నారు.

# వైఏఐ సీనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్ 2024

న్యూఢిల్లీ, 20 :యాచింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (జంఏ) సీనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్ 2024 పోటీలు మే 18న ముగిసాయి. జాతీయ ఛాంపియన్ కోసం పోటీ తీవ్రంగా జరిగింది. విజేతలను నిర్ణయించడానికి మే 18న నాలుగు పతక పోటీలు జరిగాయి. సీనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్ 2024 పోటీలు ముంబైలోని ఇండియన్ నేవల్ వాటర్‌మాన్‌షిప్ ట్రైనింగ్ సెంటర్‌లో మే 12-18 వరకు జరిగాయి. అత్యంత సవాళ్లతో కూడిన పరిస్థితుల మధ్య పోటీలు జరిగాయి.

గాలులు 20 నాట్‌లకు చేరుకోవడం పోటీదారుల ఉత్సాహాన్ని పెంచింది.

యాచింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా , ఇండియన్ నేవీ సెయిలింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎనిమిది ఒలింపిక్ తరగతుల్లో పోటీలు జరిగాయి. ఛాంపియన్‌షిప్‌లో తిఖిఈనీతిశ్రీ (పురుషులు, మహిళలు విండ్‌సర్ఫ్‌ను విడదీయడం), ఔంఅఖీం 17 (మిశ్రమ ఫోయిలింగ్ కాటమరాన్) ఎఒఅం 7 (పురుషులు సింగిల్ హ్యాండ్ డింగీ), ఎఒఅం 6 (మహిళలు సింగిల్ హ్యాండ్ డింగీ), 470 (మిశ్రమ డింగీ), 49వతీ (పురుషులు స్కిఫ్), 49వతీఈచీ (మహిళలు స్కిఫ్), ఫార్ములా కైట్ (పురుషులు మరియు మహిళలు కైట్‌సర్ఫింగ్) తరగతుల్లో పోటీలు జరిగాయి. దేశం వివిధ ప్రాంతాలకు చెందిన 10 సెయిలింగ్ క్లబ్‌ల నుంచి 82 మంది విజయం కోసం పోటీ పడ్డారు. నేషనల్ ఛాంపియన్ ఆఫ్ సెయిలింగ్ టైటిల్ విజేతను నిర్ణయించడానికి ఆరు రోజుల పాటు 04 పతకాల రేసులతో సహా మొత్తం 94 రేసుల్లో తీవ్ర పోటీ జరిగింది.

వరల్డ్ సెయిలింగ్ ఇంటర్నేషనల్ రేస్ అధికారులు ,ఆస్ట్రేలియా, సింగపూర్, దక్షిణ కొరియా నుంచి వచ్చిన అంతర్జాతీయ న్యాయ నిర్ణేతలు నిపుణుల పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. పోటీ పడిన వారందరికీ సమాన అవకాశాలు కల్పించారు. ఉన్నత ప్రమాణాలతో పోటీలు నిర్వగించిన నిర్వాహకులు నావికుల పోటీ స్ఫూర్తిని ప్రదర్శించడానికి అవకాశం అందించారు.




# యాదాద్రి భక్తులకు డ్రెస్ కోడ్.. జూన్ 1 నుంచి అమల్లోకి..

హైదరాబాద్, 20 :ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులకు డ్రెస్ కోడ్ తప్పనిసరి చేస్తూ ఆలయ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. నరసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించాలని యాదగిరిగుట్ట దేవస్థానం తాజాగా ఆదివారం నిర్ణయించింది.

వివిధ సేవల్లో పాల్గొనే భక్తులు తప్పనిసరిగా సంప్రదాయ దుస్తులు ధరించాలనే నిబంధన జూన్ 1 నుంచి అమల్లోకి రానుంది. కాగా.. యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం అనంతరం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునే భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఆలయంలో ఇప్పటికే ఆలయ ఈవోతో పాటు సిబ్బంది కూడా డ్రెస్ కోడ్‌ను పాటిస్తున్నారు.

హిందూ సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించేలా చర్యలు తీసుకోవాలని యాదగిరిగుట్ట దేవస్థానం నిర్ణయించింది. నిత్య కల్యాణం, హోమం, జోడు సేవ, శ్రీసుదర్శన నరసింహ హోమం, శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలు తదితర కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు సంప్రదాయ వస్త్రాలు ధరించాలని నిబంధన విధించారు.

తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగానే యాదాద్రిలో కూడా భక్తుల వీఐపీ బ్రేక్ దర్శనానికి డ్రెస్ కోడ్ తప్పనిసరి చేసింది. స్వామివారి విరామ దర్శనానికి వచ్చే భక్తులకు ఈ నిబంధన తప్పనిసరిగా వర్తిస్తుందని, అదేవిధంగా సాధారణ ధర్మ దర్శనానికి క్యూ లైన్లో వచ్చే భక్తులకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఉందని యాదగిరిగుట్ట దేవస్థానం ఈవో భాస్కరరావు తెలిపారు. జూన్ 1 నుంచి ఆలయంలో డ్రెస్ కోడ్ నిబంధనలు కఠినంగా అమలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా ఆలయంలో ఆధ్యాత్మికత, భక్తి భావాన్ని పెంపొందించేందుకే ఇలాంటి నిబంధనలు అమలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు యాదాద్రీశుని క్షేత్ర ప్రాధాన్యతను తెలియజేసేందుకు సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని, బోర్డుపై క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే వివరాలు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని ఈవో తెలిపారు.

# ఎమ్మెల్యేలు, మంత్రులను గ్రామాల్లో తిరుగనివ్వం

## -బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

## -సమగ్ర కులగణన చేపట్టాలి

## -బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



హైదరాబాద్, 20 :కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతం వరకు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 40 బీసీ సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలతో కలిసి ఆర్.కృష్ణయ్య విలేకరుల సమావేశం లో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను పెంచిన తర్వాతనే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమగ్ర బీసీ కులగణన చేపట్టి చట్ట సభలో బీసీ రిజర్వేషన్లను ప్రవేశపెడుతామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారని, పెంచిన తర్వాతనే ఎన్నికలను నిర్వహించాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా బీసీలను చైతన్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు కాంగ్రెస్ పార్టీ మొండి చేయి చూపిందని మండిపడ్డారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి సమగ్ర కులగణన చేపట్టాలని లేనిపక్షంలో ఎమ్మెల్యేలు, మంత్రులను గ్రామాల్లో తిరుగనివ్వమని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు సి.రాజేందర్, శ్రీనివాస్, అనంతయ్య, పర్వ తాలు, కృష్ణమూర్తి, మహిళా బీసీ నేతలు భాగ్యలక్ష్మి, శారద పాల్గొన్నారు.

# సుచిత్రలో భూ వివాదంపై.. ఏ సర్వేకైనా సిద్ధం

## -మా తప్పు తేలితే క్షమాపణ చెప్పి వెళ్లిపోతాం

## -ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



హైదరాబాద్, 20 :కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సుచిత్ర చౌరస్తాలో మాజీ మంత్రి మల్లారెడ్డి భూ వివాదంలో తాము ఏ సర్వే చేపట్టినా సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఆదివారం కొంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2015లో తనతో పాటు మరో ఎనిమిది మంది కలిసి సర్వే నంబర్ 82/1/ఈఈలో నాలుగు వేల గజాల స్థలాన్ని కె.సుధామ వద్ద నుంచి కొనుగోలు చేశామన్నారు. 2021లో శేరి శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తికి అందరం కలిసి విక్రయించామన్నారు.

గతంలో మంత్రి పదవిలో కొనసాగిన మల్లారెడ్డి.. ఆ స్థలంలో ఎందుకు నిర్మాణ పనులు చేపట్టలేదని ప్రశ్నించారు. కోర్టు ఇంజెక్షన్ ఆర్డర్ ఇచ్చినా.. దానికి ఎలాంటి స్పందన ఇవ్వలేదన్నారు. సర్వే చేయడానికి నోటీసులు ఇప్పిస్తే దానికి స్పందించకుండా తన వియ్యంకుడు మర్రి లక్ష్మారెడ్డితో సమాధానం పంపించాడని, స్థలంలో వెలిసిన తేజా వైన్స్‌ను నిషేధించాలని ఎక్సైజ్ శాఖకు, అందులో ఎలాంటి వ్యవహారాలు జరపరాదని మున్సిపల్, పోలీసు శాఖలకు ఫిర్యాదులు చేసినా.. ఎవ్వరూ పట్టించుకున్న పాపనపోలేదన్నారు. మల్లారెడ్డికి సంబంధించిన స్థలం పక్కన ఉన్న తమ భూమిని ఆక్రమించి, సినీ ప్లానెట్ కట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారన్నారు.

సాటి ఎమ్మెల్యేగా గౌరవమిస్తానని, చట్టపరంగా వ్యవహరించాలని కోరారు. మాది తప్పు అని తేలితే అక్కడి నుంచి తప్పుకుంటామన్నారు. మల్లారెడ్డి ఏ సర్వే చేపట్టినా మేమంతా సిద్ధంగా ఉన్నామన్నారు. ఆ స్థలం విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేదని, అనవసరంగా మాజీ మంత్రి మల్లారెడ్డి తనపై నిందలు వేయడం సరికాదన్నారు. తనకు సంబంధించిన భూమిని శేరి శ్రీనివాస్‌రెడ్డికి అమ్మినట్లు చెప్పారు. తనను ఈ భూ వివాదంలోకి లాగొద్దని, ఏదైనా న్యాయపరమైన అంశాలపై చర్చ ఉంటే తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, రాష్ట్ర నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# పేద విద్యార్థులకు 'నవద్వీప' చేయూత

కొండాపూర్, మే 20 : పలు అనాథాశ్రమాల్లో ఉంటున్న చిన్నారుల విద్యాభ్యాసానికి హైటెక్‌సిటీలోని మై హోం నవద్వీప ఫౌండేషన్ ఆర్థిక సాయమందించింది. ఆదివారం ఆశ్రమ నిర్వాహకులకు ఫౌండేషన్ సభ్యులు రూ. 2,75,800ల చెక్‌లను అందజేశారు.

ఈ సందర్భంగా నవద్వీప ఫౌండేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ.. పలు అనాథ ఆశ్రమాల్లో ఉంటున్న 30 మంది చిన్నారులకు ఈ విద్యా సంవత్సరానికి అవసరమైన స్కూల్ ఫీజుల కోసం ఆర్థిక సాయమందిస్తున్నట్లు తెలిపారు. ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే ఎంతో మందికి సాయం చేస్తున్నామన్నామన్నారు.

# విదేశాంగ మంత్రిగా అలీ బఘేరి.. ప్రకటించిన ఇరాన్ ప్రభుత్వం

న్యూఢిల్లీ, 20 :ఇరాన్‌కు చెందిన ప్రముఖ అణు సంధానకర్త అలీ బఘేరిని ఆ దేశ విదేశాంగ మంత్రిగా నియమించారు. విదేశాంగ శాఖకు శాశ్వత మంత్రిని నియమించే వరకు ఆయన యాక్టింగ్ మంత్రిగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు ఇరాన్ సర్కారు అధికారిక మీడియా ద్వారా ఒక ప్రకటన చేసింది.

ఇరాన్ విదేశాంగ మంత్రి హొస్సేన్ అమీర్ అబ్దొల్లాహైన్.. అధ్యక్షుడు ఇబ్రహీమ్ రైసీతోపాటు హెలికాప్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో తాత్కాలికంగా అలీ బఘేరిని ఆ పదవిలో నియమించారు. ఇన్నాళ్లు అమీర్ అబ్దొల్లాహైన్ కింద విదేశాంగ శాఖ డిప్యూటీ మంత్రిగా వ్యవహరించిన అలీ బఘేరిని యాక్టింగ్ విదేశాంగ మంత్రిగా నియమిస్తున్నామని ఇరాన్ ప్రభుత్వ ప్రభుత్వ ప్రతినిధి అలీ బహదోరి జహ్రోమి మీడియాకు వెల్లడించారు.

# దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

హైదరాబాద్, 20 : నియోజకవర్గ పరిధిలోని కాలనీల సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఉప్పల ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని సోనియాగాంధీనగర్ ఫేజ్1 నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరైయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని కాలనీలలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సోనియగాంధీనగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. అనంతరం కాలనీ నూతన కమిటీ సభ్యులు శ్యామల భిక్షపతి, పలుగుల గోపాల్, తాండ్ర యాదగిరి, మైలారం బాల్‌నర్సింహ్మా, రాజుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డిలతో ప్రమాణం చేయించారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పజ్జూరి పావనీమణిపాల్‌రెడ్డి, సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, నాయకులు నేమూరి మహేశ్‌గౌడ్, వంశరాజు మల్లేశ్, ఇస్లావత్ హరినాయక్, సీసీఎస్ ప్రతినిధి ఎంపెల్లి పద్మారెడ్డి, సీతారామిరెడ్డి, రాములు యాదవ్, పలుగుల మహేందర్, బాల్‌నర్సింహ్మాగౌడ్, సిద్దుగౌడ్, దామోదర్‌రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

# అచ్చంపేటలో గాలివాన, బీభత్సం..

## -దాదాపు అరగంట పాటు కురిసిన వర్షం

## -నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

## -పొంగిపొర్లిన డ్రైనేజీలు

## -రోడ్లపై, కాలనీలలో నిలిచిపోయిన మురుగు నీరు

మహబూబ్‌నగర్, 20 : నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో సోమవారం మధ్యాహ్నం దాదాపు మూడు గంటల సమయంలో బలమైన ఈదురు గాలులు, వర్షాలు బీభత్సాన్ని సృష్టించాయి. అచ్చంపేట పట్టణంలో ఐనోల్ గ్రామానికి సరఫరా చేసే 33 కెవి రెండు స్తంభాలు పూర్తిగా విరిగిపోగా, లక్ష్మాపూర్, అమ్రాబాద్ మండలానికి సరఫరా చేసే 5 విద్యుత్ స్తంభాలు నేలకొరిగి పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఫారెస్ట్ చెక్ పోస్ట్ సమీపంలోని పాల శీతల కేంద్రంలో చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడిందని అచ్చంపేట విద్యుత్ శాఖ ఏఈ ఆంజనేయులు తెలిపారు. అచ్చంపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా, పలు కాలనీలలో డ్రైనేజీలు పొంగిపొర్లి మురుగునీరు తో కలిసిన వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉండడంతో పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

# కొత్త అధ్యక్షుడిగా మహమ్మద్ మొఖ్బర్..



న్యూఢిల్లీ, 20 :ఇరాన్ కొత్త అధ్యక్షుడిగా వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ మోక్బర్ ఎన్నికయ్యారు. ఆయనను అధ్యక్షుడిగా ఎంపిక చేస్తూ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన తాత్కాలిక అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునే వరకు మోక్బర్ అధ్యక్షుడిగా కొనసాగుతారు. ఇరాన్ రాజకీయాలకు సుపరిచితమైన మహమ్మద్ మొఖ్బర్ 2021లో రైసీ అధ్యక్షుడిగా ఎన్నికైనప్పటి నుంచి వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

కాగా, మొఖ్బర్ అధ్యక్షతన పార్లమెంటరీ స్పీకర్, జ్యుడీషియరీ చీఫ్ ఓ కౌన్సిల్ ఏర్పాటవుతుంది. 50 రోజుల్లోగా అధ్యక్ష ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ఈ కౌన్సిల్‌దే. అయితే? ఈ ప్రక్రియకు సుప్రీం లీడర్ అనుమతి తప్పని సరి.

# ఆ రేవ్ పార్టీలో ఉన్న కారు నాది కాదు : ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి

న్యూఢిల్లీ, 20 : కర్ణాటక రాజధాని బెంగళూరు లో ఆదివారం ఓ రేవ్ పార్టీ జరిగిన విషయం తెలిసిందే. ఈ రేవ్ పార్టీలో టాలీవుడ్‌కు చెందిన ప్రముఖులతో పాటు పలువురు రాజకీయ నేతలు ఉన్నట్లు తెలుస్తుంది. ఇక ఈ రేవ్ పార్టీలో డ్రగ్స్ కూడా వాడినట్టు పోలీసులు గుర్తించారు. రేవ్ పార్టీ జరిగిన ప్రదేశాన్ని పోలీసులు, నార్కోటిక్ అధికారులు పరిశీలించారు. కర్ణాటక, తెలుగు రాష్ట్రాలకు చెందిన వంద మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

అయితే ఈ రేవ్ పార్టీలో ఏపీకి చెందిన ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేరుతో ఉన్న బెంజ్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఈ రేవ్ పార్టీలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రమేయం కూడా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఈ వార్తలపై తాజాగా గోవర్ధన్‌రెడ్డి స్పందించారు. బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో పట్టుబడ్డ కారుతో నాకు సంబంధం లేదు. ఆ కారు నాది కాదు. కారు మీద ఏ స్టిక్కర్ ఉందో తాను చూడలేదని తెలిపారు. తన పేరు మీద స్టిక్కర్ ఉందని వేరే వాళ్ళు ఫోన్ చేస్తే తనకు తెలిసిందని వెల్లడించారు. ఈ క్రమంలోనే తనకు సంబంధం లేని ఘటనపై తాను స్పందించనని తెలిపారు.

# ముంపు సమస్య లేకుండా చూడండి

## -ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్, 20 :మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో



ముంపు సమస్య పునరావృత్తం కాకుండా చూడాలని ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మిథిలానగర్, భవానీ నగర్‌లో పర్యటించి కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలాపూర్ చౌరస్తాలో ఓ ప్రైవేట్ దవాఖానను ప్రారంభించారు. వర్షాకాలంలో కాలనీలలో వరద నీరు నిల్వకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని, పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని, వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.

ముంపు కాలనీల ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించాలన్నారు. నాలా పనులు పూర్తి చేయకుండా వదిలేసిన వాటిని పూర్తిచేయించాలన్నారు. చెరువు పరిసరాలలో ఉన్న కాలనీలకు వర్షం నీరు రాకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. చెరువు సుందరీకరణ పనులు పూర్తి చేయాలని, వరద కాల్వలకు అడ్డుగా ఉన్న వాటిని గుర్తించి చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ముంపు కాలనీలలో అధికారులు పర్యటించి సమస్యలను తెలుసుకొని త్వరగా పరిష్కరించాలని, ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, మాజీ ఎంపీపీ సిద్దాల లావణ్య బీరప్ప, కార్పొరేటర్లు అనిల్‌కుమార్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేశ్ రెడ్డి, బడంగ్‌పేట అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దీప్‌లాల్ చౌహాన్, కాలనీ వాసులు వెంకటేశ్వర్లు, ఫిరాజ్, విజయసింహా రెడ్డి, పూర్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బెంగళూరులో రేవ్ పార్టీ కలకలం..

## -పలువురు తెలుగు నటీమణులతో సహా 100 మంది అరెస్ట్

## -ఆంధ్రాకు చెందిన ఓ ఎమ్మెల్యే పాస్ పోర్ట్ ను పోలీసులు స్వాధీనం

బెంగళూరు మే 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); బెంగళూరులో రేవ్ పార్టీ కలకలం రేపింది. ఆదివారం రాత్రి బెంగళూరు నగరంలోని ఎలక్ట్రానిక్ సిటి సమీపంలోని ఓ ఫామ్ హౌస్ లో రేవ్ పార్టీ జరుతున్న సమయంలో పోలీసుల దాడి చేశారు. రేవ్ పార్టీలో ఎండీఎంఏ, కొకైన్ డ్రగ్స్ వాడుతున్నట్లు గుర్తించారు. ఈ రేవ్ పార్టీలో పాల్గొన్న ఆంధ్రా, బెంగళూరుకు చెందిన 100 మందిని పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడిన వారిలో 25 మందికి పైగా యువతులు ఉన్నట్లు తెలుస్తోంది.

బెంజ్ కారులో ఆంధ్రాకు చెందిన ఓ ఎమ్మెల్యే పాస్ పోర్ట్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ పార్టీలో పాల్గొని అరెస్టైన వారిలో పలువురు తెలుగు నటీమణులు కూడా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సింది.

# ఆయుష్మాన్‌భవ! పెరిగిన మనుషుల ఆయుష్షు

## -లాన్సెట్ జర్నల్ అధ్యయనం లో వెల్లడి

## -పురుషులలో ఐదేళ్లు, మహిళలలో నాలుగేళ్లు పెరుగుదల

## -భారత్ లో పురుషుల సగటు ఆయుష్షు 75 ఏళ్లు

## -మహిళల సగటు 80 ఏళ్లు

## -2050 నాటికి మరింతగా పెరిగే అవకాశం

న్యూఢిల్లీ, 20 :"నా ఆయుష్షు కూడా పోసుకుని నిండు నూరేళ్లు జీవించు నాయన.." అనే మాట మనం తరచూ వింటుంటాం. ఇప్పుడు ఇలాంటి ఆశీస్సులేవి అవసరం లేదు. ప్రస్తుతం మనుషుల జీవించే రోజులు పెరిగినట్లు తాజాగా ఓ అధ్యయనం వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా పురుషుల వయసు 5 సంవత్సరాలు, మహిళల వయసు 4 ఏళ్లు పెరుగుతున్నట్టు తెలిపింది. 2022-2050 మధ్య కాలంలో ఈ మార్పు కనిపిస్తోందని లాన్సెట్ జర్నల్ ప్రచురించిన ఓ అధ్యయనం తెలిపింది. అంతేకాదు విచిత్రమేమిటంటే ఇప్పటి వరకు ఆయుర్దాయం తక్కువగా ఉన్నాయని భయపడుతున్న దేశాల్లో ఈ పెంపుదల నమోదవుతున్నట్టు తెలిపింది. ఇది ఇతర దేశాల్లోనూ కనిపిస్తున్నట్టు అధ్యయనం చెప్పడం గమనార్హం.

కరోనా అనంతరం..

కరోనా అనంతరం.. ప్రపంచ వ్యాప్తంగా రోగనిరోధక శక్తికి సంబంధించిన ఔషధాల వినియోగం పెరిగిన విషయం తెలిసిందే. ఇలా రోగనిరోధక శక్తి పెరగడంతో ఆ ప్రభావం ఆయుర్దాయంపైనా పడినట్టు పరిశోధకులు చెబుతున్నారు. దీనివల్ల మానవ జీవన కాలం పెరుగుతోందని అంచనా వేశారు. దీంతో పాటు ఆయుర్దాయ అసమానతలు కూడా తగ్గుతున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని అమెరికా రాజధాని వాషింగ్టన్ యూనివర్సిటీలోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఇవాల్యుయేషన్ డైరెక్టర్ క్రిస్ ముర్రే పేర్కొన్నారు.

# ఆరు నెలల్లో కొత్తగా 12,905 కోట్ల రూపాయల అప్పు చేసిన రేవంత్ ప్రభుత్వం

–ఎఫ్ఆర్బీఎం పరిమితి గరిష్ట స్థాయికి చేరుకుంది
–కొత్త కార్పొరేషన్లను ఏర్పాటు చేసి భారీ స్థాయిలో రుణాలని పొందే ప్రయత్నం
–అప్పులు కట్టడానికి మరిన్ని కొత్త అప్పులు చేయవలసిన దుస్థితి
–ప్రభుత్వ భూములు అమ్మటానికి ఇప్పటికే శ్రీకారం చుట్టారు
–దుబారా గణనీయంగా పెరుగుతోంది
–రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టడం కోసం రిజర్వ్ బ్యాంక్ ద్వారా కొత్త మార్గదర్శక సూత్రాలు రూపొందించండి
–కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ కోరిన ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్



న్యూ ఢిల్లీ మే 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ మంత్రి శ్రీమతి నిర్మల సీతారామన్ ను సోమవారం సాయంకాలం బిజెపి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ,ఉప్పల్ మాజీ శాసనసభ్యుడు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ న్యూఢిల్లీలో కలిశారు . ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో లోక్సభ ఎన్నికల సంబంధించిన అంశాలను పోలింగ్ శాతం వివరాలను వివరించి కనీసం 10 స్థానాల్లో భారీ మెజారిటీతో బిజెపి అభ్యర్థులు గెలిచే అవకాశం ఉందని వివరించారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ అనుకూల పవనాలు ఈసారి దక్షిణాదిలో కూడా చాలా బలంగా , గాలి వీస్తున్నది అని సాధారణ పౌరులు మాట్లాడుకుంటున్న విషయాలని, వివరాలని వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలలు తిరగకముందే 12,905 కోట్ల రూపాయల అప్పు కొత్తగా చేసిందని .ఈఖీఃఓ పరిమితి గరిష్ట స్థాయికి చేరుకుందని ప్రభాకర్ ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం బడ్జెట్ ఏతర రుణాల మీద దృష్టి సారించిందని, బహిరంగ మార్కెట్లో రుణాలు సేకరించడానికి సిద్ధమవుతుందని ఆర్థిక మంత్రి దృష్టికి ప్రభాకర్ తీసుకుని వెళ్లారు. గత ప్రభుత్వం ఇప్పటికే అనేక కార్పొరేషన్లను ఏర్పాటు చేసి రుణాలు పొందగా, ఇప్పుడు ఈ కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం మరిన్ని కొత్త కార్పొరేషన్లను ఏర్పాటు చేసి భారీ స్థాయిలో రుణాలని పొందటానికి ప్రయత్నం చేస్తుందని వివరించారు. ఈ చర్యలు ఆర్థిక పరిస్థితిని మరింత దిగదారుస్తుందని .అప్పులు కట్టడానికి మరిన్ని కొత్త అప్పులు చేయవలసిన దుస్థితి ఏర్పడింది అని వారు వాపోయారు, ప్రభుత్వ భూములు అమ్మటానికి ఇప్పటికే శ్రీకారం చుట్టారని మరిన్ని భూములు అమ్మడం కొరకు సిద్ధమవుతున్నారని తెలియజేశారు. రోజురోజుకీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులు తగ్గుతున్నాయని ,అప్పులు మాత్రం గణనీయంగా పెరుగుతున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి గారి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం నియమిస్తున్న సలహాదారుల ,కార్పొరేషన్ చైర్మన్ ల రాజకీయ నియామకాలు ప్రభుత్వ ఖజానా గుల్ల అవుతుందని ,దుబారా గణనీయంగా పెరుగుతోందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర ఆర్థిక సంఘం స్థానిక సంస్థలకు అందిస్తున్న నిధులను కూడా ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తూ స్థానిక సంస్థలను కూడా నిర్వీర్యం చేస్తున్న అంశాన్ని వారి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టడం , ఆర్థిక క్రమశిక్షణ పాటించడం కొరకు రిజర్వ్ బ్యాంక్ ద్వారా కొత్త మార్గదర్శక సూత్రాలు రూపొందించడం కొరకు ప్రయత్నించాలని కోరారు

# చెడ్డి గ్యాంగ్ తరహాలో కొత్తగా కలకలం సృష్టిస్తున్న చుడీదార్ గ్యాంగ్

హైదరాబాద్ మే 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):హైదరాబాద్‌లో చెడ్డి గ్యాంగ్ తరహాలో కొత్తగా చుడీదార్ గ్యాంగ్ కలకలం సృష్టిస్తుంది. ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి జెక్ కాలనీలోని ఆకృతి ఆర్కేడ్ అపార్ట్‌మెంట్‌లో దుండగులు చుడీదార్ వేసుకొని దొంగతనానికి పాల్పడ్డారు. వెంకటేశ్వర్ రావు అనే వ్యక్తి ఇంట్లో 4 తులాల బంగారం, రూ. లక్ష నగదు, ల్యాప్ టాప్ ను చుడీదార్ వేసుకున్న గ్యాంగ్ దొంగతనం చేసింది. ఇద్దరు దుండగులు చుడీదార్ ధరించి దొంగతనానికి పాల్పడిన వీడియో సిసి టివి ఫూటేజీలో నిక్షిప్తమైంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ దుర్మరణం

న్యూ డిల్లీ మే 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ మృతి చెందారు. ఆదివారం ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ప్రమాదానికి గురైంది. అజార్ బైజాన్ సరిహద్దులోని బోలా సిటీ సమీపం లో వాతావారణం అనుకూలించక పోవడంతో అటవి ప్రాంతంలో కూలిపోయింది. దీంతో భద్రతా దళాలు హుటాహుటిన రంగంలోకి దిగాయి. ఇబ్రహీం ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టిన బలగాలు విమానా ప్రమాద స్థలాన్ని గుర్తించారు. అయితే, అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ చనిపోయినట్లు అధికారులు వెల్లడించారు. ఇబ్రహీం మృతి ప్రపంచ దేశాల నేతలుగ్భ్రాంతి వ్యక్తం చేశారు.కాగా, ఇరాన్– అజర్‌బైజాన్ సరిహద్దుల్లో నిర్మించిన కిజ్ కలాసీ, ఖొదావరిన్ అనే రెండు డ్యాంలను అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలియేవ్‌తో కలిసి రైసీ ఆదివారం వాటిని ప్రారంభించారు. అనంతరం తిరిగి వెళ్తుండగా విమానం కుప్పకూలిపోయింది.

# మతిభ్రమించి మాట్లాడుతున్న హరీష్ రావు

– పీసీసీ అధికార ప్రతినిధులు భవాని రెడ్డి




హైదేవ్రాబాద్ మే 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బిఆర్ఎస్ నేత హరీష్ రావు మతిభ్రమించి మాట్లాడుతున్నారని పీసీసీ అధికార ప్రతినిధులు భవాని రెడ్డి విమర్శించారు.సోమవారం గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ పదేండ్ల మీ పాలనలో ప్రజలు చీదరించుకొని మిమ్ముల్ని బౌన్స్ చేశారన్నారు.కొత్త గూడెంలో రైతులకు భేడీలు వేసింది ఎవరు ప్రజలకు తెలుసునని,ఉద్యోగస్తులకు జీతాలు ఇవ్వలేని అసమర్థ పాలన కేసీఆర్ ది అని ఆమె దుయ్యబట్టారు.ప్రజలకి సుపరిపాలన కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆగస్ట్ 15 వరకు 2లక్షల ఋణమాఫి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారని,ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.కేటీఆర్ ,హరీష్ రావు లకు గుబ గుయ్యిమనేలాగ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న గెలుస్తుండన్నారు.రాకేష్ రెడ్డి ఎప్పుడైనా ఉద్యమాలు చేసిండా సమస్యల పై పోరాడిన తీన్మార్ మల్లన్న పై ఎన్నో కేసులు ఉన్నవన్నారు.

# ఘనంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుని జన్మదిన వేడుకలు

– వేడుకలకు హాజరైన టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి




ఖమ్మం, 20 :(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో సోమవారం జరిగిన ఈ వేడుకకు ముఖ్య అతిధులుగా టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి లు హాజరయారు. రమేష్ బాబు కేక్ కట్ చేసి జర్నలిస్ట్ మిత్రులకు స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ మాట్లాడుతూ... జర్నలిస్టుల సౌకర్యార్థం ఖమ్మం ప్రెస్ క్లబ్ ను సొంత ఖర్చులతో ఉచిత ఇంటర్నెట్ కనెక్షన్ తో పాటు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు చక్కటి పూల మొక్కలు, కనీస వసతులు ఏర్పాటుచేసి గుర్తుండి పోయేవిధంగా ప్రెస్ క్లబ్ అభివృద్ధికి కృషి చేసిన అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబును, ప్రెస్ క్లబ్ కమిటీని అభినందించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ యూనియన్ సీనియర్ నాయకులు అమరవరపు కోటేశ్వరరావు, జిల్లా నాయకులు టీఎస్ చక్రవర్తి, మందుల ఉపేందర్, యలమందల జగదీష్, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, కామర్తి నరేందర్, మూల జీవన్ రెడ్డి, తోట గణేష్, మందుల వెంకటేశ్వర్లు, బండి కుమార్, పప్పుల వేణుగోపాల్, ఆంతోటి శ్రీనివాస్, రోసిరెడ్డి, యాదగిరి, నల్లమోతు శ్రీనివాస్, మురళి,ఉత్కంఠం శ్రీనివాస్, మహేష్, పాశం వెంకటేశ్వర్లు, వీడియో జర్నలిస్ట్ రవి, ఇస్సంపల్లి వెంకటేశ్వర్లు, రామారావు, యోనా, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఈసెట్ ఫలితాలు విడుదల..

– 95.86% శాతం విద్యార్థులు క్వాలిఫై

హైదరాబాద్ మే 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ ఈసెట్ ఫలితాలను విడుదల అయ్యాయి. సోమవారం మధ్యాహ్నం ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి ఈ–సెట్ ఫలితాలను విడుదల చేశారు. ఈ సెట్‌లో 95.86% శాతం మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా 23,330 మంది విద్యార్థులు ఈ సెట్ పరీక్ష రాయగా.. వారిలో 22,365 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు. అధికారిక వెబ్‌సైట్ ష్ట్రబిబిజూబ:// వఞవబి.బిబఇష్ట్రవ.జీఇ.తిని/ద్వారా రిజల్ట్స్ చూసుకోవచ్చని చెప్పారు. ఇక, జూన్ 2 నుంచి ఈ సెట్ అడ్మిషన్లు మొదలవుతాయని లింబాద్రి వెల్లడించారు.పరీక్షకు హాజరైన అభ్యర్థులు బీటెక్ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ ప్రవేశాల కోసం మే 6వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈసెట్ ? 2024 పరీక్షను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది టీఎస్ ఈసెట్ 2024 ప్రవేశ పరీక్షను ఉస్మానియా వర్సిటీ నిర్వహించింది.

# బీజేపీ ఉన్నంత వరకూ రిజర్వేషన్లను ఎవరూ టచ్ చేయలేరు : అమిత్ షా

న్యూఢిల్లీ, 20 : లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి ప్రదాని నరేంద్ర మోదీ మరోసారి పాలనా పగ్గాలు చేపడితే రిజర్వేషన్లను తొలగిస్తారని కాంగ్రెస్ అసత్యాలను ప్రచారం చేస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు.

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం హరియాణలోని ఝుజర్‌లో జరిగిన ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో బీజేపీ ఉన్నంతవరకూ రిజర్వేషన్లను ఏ ఒక్కరూ కదిలించలేరని అన్నారు.

ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టారని ఎన్నికల అనంతరం బైనాక్యులర్స్‌తో వెతికినా కాంగ్రెస్ పార్టీ కనిపించదని అమిత్ షా ఎద్దేవా చేశారు.

కాషాయ పార్టీ రాజ్యాంగాన్ని మార్చివేస్తుందని, రిజర్వేషన్లు రద్దు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం సాగిస్తోందని దుయ్యబట్టారు.

# ప్రయివేటు విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రించాలి

-మండల విద్యా అధికారులను, భోధన, భోధనేతర సిబ్బందిని వెంటనే నియమించాలి
-నాణ్యమైన విద్యా ప్రమాణాల పెంపుకు లోక్ సత్తా పార్టీ డిమాండ్



హైదరాబాద్ మే 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్) నానాటికీ దిగజారి పోతున్న విద్యా ప్రమాణాలను పెంపొందించి విద్యార్థినీ, విద్యార్థుల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చి దిద్దేలా వచ్చే విద్యా సంవత్సరానికి గాను చేపట్టే ప్రణాళికలను ప్రకటనలతో సరిపెట్టకుండా, మొక్కుబడిగా కాకుండా నాణ్యమైన విద్యా ప్రమాణాలు అందించే విధంగా పటిష్ట కార్యాచరణను ప్రభుత్వం వెంటనే ప్రకటించి అమలుకు శ్రీకారం చుట్టాలని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మనపల్లి శ్రీనివాసు డిమాండ్ చేశారు. ఈ రోజు రాష్ట్ర కార్యాలయం లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి అధ్యక్షత వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పై విధంగా స్పందించారు. ప్రయివేటు విద్యా సంస్థల్లో ఫీజులు అధికంగా వసూలు చేయడం వల్ల తల్లి దండ్రులకు భారం అవుతొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే రాష్ట్ర ఫీజుల నియంత్రణ కమిటీని పునరుద్ధరించి తల్లిదండ్రులకు భారం లేకుండా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కొత్తగా రాష్ట్రంలోని 203 గ్రామ పంచాయతీల్లో ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించుకోవడం శుభ పరిణామమని ఆయన అన్నారు. ఖాళీలుగా వున్న మండల విద్యాధికారులను మరియు భోధన,బోధనేతరుల సిబ్బందిని విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే వెంటనే నియమించి విద్యా ప్రమాణానాలను పెంచాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. త్వరలో రాష్ట్రంలోని పాఠశాలల పనితీరుపై, తీసుకోవాల్సిన చర్యలపై తగు నివేదికను రూపొందించి ప్రభుత్వానికి అందజేస్తామని తుమ్మనపల్లి స్పష్టం చేశారు. విద్యా ప్రమాణాల మెరుగుకు లోక్ సత్తా పార్టీ చేపట్టే కార్యక్రమాల నిర్వహణకు ఒక బృందాన్ని వంశీ ప్రసాద్ కన్వీనర్ గా , సభ్యులుగా శివరామ కృష్ణా, రాజీవ్, శ్యామ్, వరుణ్ లు సేవలు అందిస్తారని సమావేశం పేర్కొంది. ఇంకా ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మెట్ల జగన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస వర్మ, కారదర్శులు నరోజాదేవి, మల్లాది కిషోర్, సుబ్రమణ్యం, వేంకటేశ్వర రావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ ముసుగులో వైఎస్సార్సీపీ కార్యకర్తలు దుష్ప్రచారం

–సీఐడీ డీజీని తెలుగుదేశం పార్టీ నేతల బృందం కలిసి ఫిర్యాదు

అమరావతి మే 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );; వైఎస్సార్సీపీ కార్యకర్తలు టీడీపీ ముసుగులో దుష్ప్రచారం చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ ఆరోపించింది ఈ మేరకు సోమవారం సీఐడీ డీజీని తెలుగుదేశం పార్టీ నేతల బృందం కలిసింది. ఆధారాలతో సీఐడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. కడప జిల్లాకు చెందిన రామాల మన్విత్ రెడ్డి అనే వ్యక్తి వ్యక్తిగతంగా కొన్ని రోజులుగా తమ పార్టీ ముసుగు వేసుకొని తమపై దుష్ప్రచారం చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత వర్ల రామయ్య అన్నారు.వైసీపీ నాయకుడు మన్విత్ రెడ్డి తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకుని మాట్లాడుతున్నారని.. ఆయన ఉన్నది వైసీపీ పార్టీలో... కానీ వేషం వేసింది మాత్రం తెలుగుదేశం పార్టీదని ఎద్దేవా చేశారు.జగన్ మోహన్ రెడ్డి మీ పార్టీలో ఇలాంటి వ్యక్తులు ఉన్నారా అని ప్రశ్నించారు. టీడీపీ అధినేత చంద్రబాబు, తమ నేతలపై ఆయన అసత్యాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. జగన్మోహన్ రెడ్డి వెంటనే మన్విత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఓడిపోతున్నామన్న ఫ్రస్టేషన్‌లో జగన్మోహన్ రెడ్డి అనుచరులు ఇష్టానుసారంగా టీడీపీపై అవాకులు చెవాకులు పేలుతున్నారని.. మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించారు.సీఐడీ అధికారులకు సాక్షాధారాలతో మొత్తం వివరించామని వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. రామాల మన్విత్ రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకుని అరెస్ట్ చేస్తామని సీఐడీ డీజీ హామీ ఇచ్చారని వర్లరామయ్య పేర్కొన్నారు.

# కోసిన పండ్ల ముక్కలు రంగు మారొద్దంటే ఈ టిప్స్ పాటించండి..!

హైదరాబాద్, 20 : సాధారణంగా యాపిల్ లాంటి కొన్ని పండ్లను కోసినప్పుడు ఆ పండ్ల ముక్కలు రంగు మారుతాయి. అలా రంగు మారకుండా ఉండాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి. పండ్లు కోసినప్పుడు రంగు మారడానికి కారణం ఆక్సిడేషన్ ప్రక్రియ. ఈ ఆక్సిడేషన్ ప్రక్రియ జరగకుండా నిలువరించగలిగితే పండ్ల ముక్కలు రంగు మారకుండా ఉంటాయి. ఈ ఆక్సిడేషన్ ప్రక్రియను నిలువరించడానికి పలు చిట్కాలు ఉన్నాయి. అవేంటో ఇప్పుడు చూద్దాం..

చిట్కాలు..

పండ్లను నీళ్ల మధ్యలో ఉంచి కోసినట్లయితే ఆక్సిడేషన్ ప్రక్రియను ఆపవచ్చు. దీనివల్ల పండ్ల ముక్కలు బ్రౌన్ రంగులోకి మారకుండా తాజాగా కనిపిస్తాయి.

అదేవిధంగా కోసిన పండ్ల ముక్కలను అల్లం ద్రావణంలో వేస్తే కూడా రంగు మారకుండా ఉంటాయి. అల్లంలో ఉండే సిట్రిక్ యాసిడ్ ఆక్సిడేషన్ ప్రక్రియను నిలిపివేస్తుంది.

ఒక బౌల్‌లో కొంచెం ఉప్పు వేసి అందులో పండ్ల ముక్కలను వేసి బాగా కలుపాలి. ఒక నిమిషం తర్వాత నీటితో శుభ్రం చేసి పక్కన పెట్టుకుంటే అవి రంగు మారకుండా ఉంటాయి.

గోరు వెచ్చని నీటిలో ఒక టేబుల్ స్పూన్ తేనె వేసి కలుపాలి. అందులో పండ్ల ముక్కలను వేసి, 30 సెకన్ల తర్వాత బయటకు తీయాలి. ఇలా చేస్తే సుమారు 8 గంటలపాటు పండ్ల ముక్కలు రంగు మారకుండా తాజాగా కనిపిస్తాయి.


తెలంగాణ సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్, అబిడ్స్, హైదరాబాద్
ఆహ్వానం



మాతృమూర్తి శ్రీమతి కోడూరు శాంతమ్మ స్మారక
బాల సాహిత్య సమ్మేళనం
2024 మే 29, 30 తేదీల్లో

వేదిక : డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరం
తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాంగణం
తిలక్‌రోడ్, అబిడ్స్, హైదరాబాద్

మొదటి సదస్సు
మధ్యాహ్నం 2 గంటలకు
'బడిలో తెలుగు భాష' చర్చా గోష్టి
విశిష్ట అతిథి
డా. దాసరి వెంకట రమణ
కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత
అధ్యక్షులు
డా. వి.ఆర్. శర్మ ప్రముఖ బాలసాహితీవేత్త
పాల్గొనే ప్రముఖులు
శ్రీ బద్రి కూర్మారావు, డా. చిట్యాల దేవేంద్రప్ప, శ్రీ పుల్లా రామాంజనేయులు, డా. శారదా హన్మాండ్లు, డా. తూర్పింటి నరేష్ కుమార్, శ్రీమతి బాలబోయిన రమాదేవి
శ్రీ కూకట్ల తిరుపతి, శ్రీ గోపగాని రవీందర్, శ్రీమతి త్రిపురారి పద్మ, శ్రీమతి జి. శ్రీమతి, శ్రీ శీలం భద్రయ్య, శ్రీ గుళ్ళపల్లి తిరుమల కాంతికృష్ణ
శ్రీ సయ్యద్ షఫీ, శ్రీ చక్రవర్తుల శ్రీనివాస్, శ్రీ అక్షరం ప్రభాకర్, శ్రీ అరుణ బట్టువార్, శ్రీ కొండూరు పోతన
సమన్వయ కర్త : డా. ఉప్పల పద్మ అధ్యాపకులు,రాష్ట్ర విద్యా పరిశోధనా మండలి

సాయంత్రం 4 గంటలకు
రెండవ సదస్సు
"పత్రికలు – బాలసాహిత్యం' చర్చా గోష్టి
అధ్యక్షులు : శ్రీ బైస దేవదాసు 'నేటి నిజం' సంపాదకులు
విశిష్ట అతిథి : శ్రీ మణికొండ వేదకుమార్ 'బాల చెలిమి' సంపాదకులు
పాల్గొనే బాలల పత్రిక సంపాదకులు, పత్రికా రచయితలు
శ్రీ టి. వేదాంత సూరి (మొలక), శ్రీ యన్.కె. బాబు (నాని), శ్రీ రాజా (చెకుముకి), శ్రీ ప్రభాకర్ (చంపక్), డా. బి. మనోహరి (మూసి)
శ్రీ పొత్తూరి సుబ్బారావు (సాహితీ కిరణం), డా. నెమిలేటి కిట్టన్న (బాలల నేస్తం), శ్రీమతి రత్నమాధవి (గడుగ్గాయి), శ్రీ కంతేటి చంద్రప్రతాప్
సమన్వయకర్త : శ్రీ కోమటి రెడ్డి బుచ్చిరెడ్డి ప్రముఖ బాలసాహితీవేత్త

సాయంత్రం 6 గంటలకు
మూడవ సదస్సు
'కథ చెప్పే కళ'
అధ్యక్షులు
శ్రీ చొక్కాపు వెంకటరమణ
కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత
విశిష్ట అతిథి
శ్రీమతి కన్నెగంటి అనసూయ
కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత
పాల్గొనే కథకులు
డా. ఎం. హరికిషన్, శ్రీ ఎన్నవెల్లి రాజమౌళి, శ్రీ వంగపల్లి పద్మ
శ్రీమతి మనోజ, శ్రీమతి దివ్య, శ్రీమతి ఎ. ప్రమీల
శ్రీమతి సమ్మెట ఉమాదేవి, శ్రీ టి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం, శ్రీమతి కృష్ణ చైతన్య
సమన్వయ కర్త :శ్రీమతి రమాదేవి కులకర్ణి ప్రముఖ కవయిత్రి

30వ తేది ఉదయం 10గంటకు
నాల్గవ సదస్సు
"లలిత కళా పరిచయం"
అధ్యక్షులు : శాంతా రావు బాల వికాసకారులు
విశిష్ట అతిథి : డా. జి. అమృతలత విద్యావేత్త, ప్రముఖ రచయిత్రి
ప్రసంగాంశాలు – వక్తలు
సంగీతం - శ్రీమతి మాడభూషిణి రాజ్యలక్ష్మి సంగీత విద్వాంసురాలు
నృత్యం - కోకా విజయలక్ష్మి ప్రముఖ నర్తకి, నాట్యగురువు
నాటకం - శ్రీ బీచరాజు శ్రీధర్ ప్రముఖ రంగస్థల నటులు, దర్శకులు
చిత్రలేఖన శిల్పకళ - శ్రీ జె. వెంకటేశ్వర్లు (జెవి) ప్రముఖ చిత్రకారులు, జెఎన్టీయూ అధ్యాపకులు
జానపద కళలు - శ్రీ గజవెల్లి ఈశ్వర్ తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాచ్యకళాశాల అధ్యాపకులు
సమన్వయకర్త : శ్రీ కోకిల నాగరాజు అధ్యాపకులు, కళాకారులు

మధ్యాహ్నం 12 గంటలకు
ఐదవ సదస్సు
"బాల సాహిత్యం – ప్రమాణాలు"
అధ్యక్షులు : శ్రీమతి ముంజులూరి కృష్ణకుమారి ప్రముఖ బాలసాహితీవేత్త
విశిష్ట అతిథి: శ్రీమతి మాడభూషి లలితా దేవి కన్వీనర్, మాడభూషి రంగాచార్య స్మారకట్రస్టు
పాల్గొనే బాలసాహితీవేత్తలు
శ్రీ టి.వి. రామకృష్ణ, డా. గంగిశెట్టి శివకుమార్, డా. కందేపి రాణి ప్రసాద్, డా. సిరి, డా. సాగర్ల సత్తయ్య, శ్రీ ఉండ్రాళ్ళ రాజేశం
శ్రీ పుప్పాల కృష్ణమూర్తి, డా. బి.వి.ఎన్. స్వామి, శ్రీ పైడిమర్రి రామకృష్ణ, శ్రీ మాచిరాజు కామేశ్వరరావు, శ్రీ ఆర్.సి. కృష్ణస్వామి, శ్రీ కొత్తపల్లి సురేశ్
సమన్వయకర్త : డా. అమరవాది నీరజ బాల సాహితీవేత్త
భోజన విరామం

ఆరో సదస్సు
మధ్యాహ్నం 2.30 గంటలకు
"బాల సాహిత్యం – గ్రంథాలయాలు"
అధ్యక్షులు : శ్రీ సి.ఎ. ప్రసాద్ బాల సాహితీవేత్త
విశిష్ట అతిథి : శ్రీ శీల అవిలేను స్వచ్ఛంద గ్రంథాలయ నిర్వాహకులు
పాల్గొనే బాల సాహితీవేత్తలు, గ్రంథాలయ నిర్వాహకులు
డా. వాసరవేణి పర్శరాములు, శ్రీ డి. ప్రవీణ్ శర్మ, శ్రీ కందుకూరి భాస్కర్, శ్రీ రాచర్ల రమేష్, శ్రీ ఎస్. వెంకటనారాయణ, శ్రీమతి సబ్బని సుమిత్రాదేవి
శ్రీ కిలపర్తి దాలినాయుడు, శ్రీ కూచిమంచి నాగేంద్ర, శ్రీ పోరెడ్డి అశోక్, శ్రీ మెండు మహేశ్వర్, శ్రీమతి గద్వాల కిరణ్ కుమారి, శ్రీ దుర్గం బైతి
సమన్వయం : డా. కాసర్ల నరేష్ రావు బాల సాహితీవేత్త, రచయిత

సాయంత్రం 4.30 గంటలకు
సమాపనోత్సవం
అధ్యక్షులు
ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
అధ్యక్షులు, తెలంగాణ సారస్వత పరిషత్తు
ముఖ్య అతిథి
శ్రీమతి ఎం. రాధారెడ్డి
డైరెక్టర్, తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్.సి.ఈ.ఆర్.టి.)
విశిష్ట అతిథి
శ్రీమతి పాలడుగు సరోజినీ దేవి
సంయుక్త సంచాలకులు, మోడల్ స్కూల్స్, తెలంగాణ ప్రభుత్వం
గౌరవ అతిథి
డా. పత్తిపాక మోహన్
దక్షిణప్రాంత అధికారి, నేషనల్ బుక్ ట్రస్ట్, భారత ప్రభుత్వం

ఈ కార్యక్రమానికి సాదరంగా ఆహ్వానిస్తున్నాం.

డా. జె. చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ సారస్వత పరిషత్తు

